ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగష్టు 02, 2015



రామేశ్వరం నుంచి... రాష్ట్రపతి భవన్‌కు...

బాలీవుడ్ స్టార్లకు ఫిల్మ్ అవార్డులు, పద్మ పురస్కారాలు గురించి వింటూనే ఉంటాం. కళా రంగానికి చేసిన సేవలకుగాను కొందరు తారలు గౌరవ డాక్టరేట్లను దక్కించుకున్నారు. తండ్రి సాహిత్యంతో ఇంగ్లండ్‌లో గౌరవాన్ని పెంచుకున్న బిగ్‌బీతో పాటు అదే ఇంగ్లండ్‌లో జాతి వివక్షను ఎదుర్కొన్న ఇండియన్‌గా ఇంటింటికీ పరిచయమున్న శిల్పా శెట్టి వరకు చాలా మంది విదేశాల్లో గౌరవ డాక్టరేట్లతో సత్కారాలు పొందినవారే.

షారూక్

బాలీవుడ్ 'డాక్టర్లు'

- అమితాబ్ బచ్చన్‌కు యూకేతో పాటు ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాలు డాక్టరేట్లను ప్రదానం చేశాయి. యూకే లీసెస్టర్‌లోని డి మాంట్‌ఫ్రంట్ విశ్వవిద్యాలయం, ఆస్ట్రేలియా క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌లతో గౌరవించాయి.
- కెనడాలో సిక్కులు ఎక్కువ. అక్కడ అక్షయ్ కుమార్ సినిమాలంటే మంచి క్రేజ్. అతడి ప్రతి సినిమా అక్కడ హిట్టే. ఆ సినిమా మాధ్యమం ద్వారానే బలమైన సాంస్కృతిక వారధి నిర్మించాడని పేర్కొంటూ అక్కీకి ఒంటారియో విశ్వవిద్యాలయం తన 46వ కాన్వొకేషన్ సందర్భంగా గౌరవ డాక్టరేట్‌ను అందించింది. డాక్టర్ అక్షయ్ కుమార్ అంటూ వేదిక మీదకు పిలవడంతో ఉద్వేగానికి గురై తాను కాలేజీ కూడా దాటలేదు.. ఇది నమ్మశక్యంగా లేదంటూ ఆనందాన్ని పంచుకున్నాడు.
- బెడ్‌ఫోర్డ్‌షైర్ విశ్వవిద్యాలయం నుంచి బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ 2009లో గౌరవ పీహెచ్‌డీ అందుకున్నాడు. దానితో పాటే అత్యున్నత పురస్కారమైన 'స్వార్డ్ ఆఫ్ ఆనర్'తోనూ గౌరవించబడ్డాడు.
- బాలీవుడ్ సహజ నటి షబానా అజ్మీ, అజరామర రచయిత జావేద్ అక్తర్ జంటకు డాక్టరేట్లు అందాయి. అయితే షబానా 5 పీహెచ్‌డీలతో సత్కారాలు పొందింది.
- బిగ్‌బ్రదర్ రియాలిటీ షో శిల్పా శెట్టి జీవితాన్ని అనూహ్యమైన మలుపు తిప్పింది. ఆ షోలోనే ఓ బ్రిటన్ నటి నుంచి జాతి వివక్ష వ్యాఖ్యలను ఎదుర్కొన్న శిల్పాకి అదే బ్రిటన్ మద్దతిచ్చి ఆ షోను నెగ్గేలా చేసింది. ఆ తర్వాత 2007లో లీడ్స్ మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయం గౌరవ పీహెచ్‌డీ అందించి తప్పును సరిదిద్దుకుంది.
- మహా గాయని లతా మంగేష్కర్, సంగీత నిధి ఏఆర్ రెహ్మాన్‌లకు అనేక విశ్వవిద్యాలయాలు డాక్టరేట్లను అందించాయి. న్యూయార్క్ విశ్వవిద్యాలయంతో పాటు మరో 5 విద్యాసంస్థలు గౌరవ పీహెచ్‌డీలు అందించాయి. స్కాట్‌ల్యాండ్ రాయల్ కన్సెర్‌వెటైర్ ఈ మధ్యే రెహ్మాన్‌ను సత్కరించింది. మరో నాలుగు విశ్వవిద్యాలయాలు ఆయనకు డాక్టరేట్లను ప్రదానం చేశాయి.
- షర్మిలా టాగూర్, ప్రీతి జింటా రెండు తరాల తారలకు ప్రతినిధులు. నటనకు కొత్త ఒరవడి తెచ్చిన వీరికి బ్రిటన్ విశ్వవిద్యాలయాలు డాక్టరేట్లను అందించాయి. వీరుకాక డ్రీమ్ గరల్ హేమమాలిని, జాతీయ ఉత్తమ నటి విద్యాబాలన్ సైతం డాక్టర్లే!

●

ప్రీతి జింటా

ఏఆర్ రెహ్మాన్

విద్యాబాలన్

శిల్పా శెట్టి

షబానా అజ్మీ

అమితాబ్

షర్మిలా టాగూర్

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

ఉల్లి లొల్లి

ప్రతి కుక్కకి ఓ రోజు వస్తుందంటే 'నిజమా', 'అబ్బ...ఛ' అనుకుంటే ఎవ్వరేం చేయలేరు. కావాలంటే గ్రామ సింహం స్థానంలో ఎవరినైనా, దేన్నైనా చెప్పకోవచ్చు. అలా... చీకటి కొట్లలాంటి కిక్కిరిసిన గోతాల్లో పడుండే... ఒకానొక ఉల్లిపాయకూ వచ్చేసిందో రోజు. మొన్నటి దాకా ఎక్కడున్నావంటే వేసిన దగ్గరున్నాననే ఉల్లి...ఇప్పుడు మాంచి గీరమీదుంది. ఎంత పిల్చినా ఉలకట్లా. పలకట్లా. కేజీ నలభై రూపాయల మీద నిలబడి చుక్కలు చూయిస్తోంది.

నిన్నటి దాకా ధారాళంగా వాడేసిన ఉల్లిపాయ ఇవాళ నల్లపూసైపోయింది. అడ్డంగా నిలువుగా కోసేసి మసాలా దట్టించేసి వేపుళ్లూ పులుసుల్లో వేసిన ఉల్లిపాయ ... ఇవాళ కూరలో ఎక్కుడుందో వెతుక్కోవాల్సి వస్తోంది. ఉల్లిపాయ పకోడీ ప్రియులకివి గడ్డు రోజులే అనుకోవాలి. ఏం వున్నా లేకున్నా పచ్చి పులుసే పరమాణ్ణంగా భావించేవారికీ కష్టకాలమే. భోజన ప్రియులకే కాదు. బజ్జీ బళ్ల వాళ్లకీ నష్టకాలమే.

వారూ వీరూ అని లేకుండా ప్రతి ఒక్కరూ... 'నీకిది తగునా ఉల్లీ! రా...దివి నుంచి భువికి దిగిరా తల్లీ!' అని దీనాతి దీనంగా వేడుకున్నా కరుణించట్లా. అంతకంతకు ఇనుమడించిన ఉత్సాహంతో పైపైకి ఎగబాకుతూ మరింత ఉడికిస్తోంది. కోసేటప్పడే కాక... కొనేటప్పుడూ కన్నీళ్లు రప్పిస్తూ కబడ్డీ ఆడుకుంటోంది. మెలకువలోనూ నిద్రలోనూ తన జపమే చేస్తున్నా పట్టించుకోవడంలా. దిగి రావడంలా.

◆ మనలో మాట

ఉల్లి లేని వంటను ఊహించగలమా! అది లేని కూరతో ముద్ద దిగుతుందా! ఇలా రోజు రోజుకి ఉల్లి ధర పెరుగుతూ వుంటే కామన్‌మేన్ బీపీ పెరిగిపోదూ! పెరిగిన ధరలతో చిక్కిశల్యమైన అతగాడి పర్సు మరింత బక్కచిక్కిపోదూ!

గతంలో తన ఘాటుతో ప్రభుత్వాలనే పడగొట్టాననే గర్వమో! నిన్నటి దాకా ఆకాశం వైపు చూసిన బంగారం ధర తగ్గడం... తన ధర పెరగడంతో వచ్చిన పొగరో! అక్కడ చూస్తోంది ఉల్లి! ఏలికలు సైతం ఎప్పటిలానే ... పేదలకు ఉల్లిపాయ అందించే ఆలోచన గట్టిగా చేయకపోవడంతో మరింత ఎగిరెగిరి పడుతోంది.

అయినా అలంకారానికి తప్ప ఎందుకూ పనికి రాని బంగారం ధర తగ్గడమేంటి? రోజువారీ ఆహారంలో కీలకమైన ఉల్లిపాయ ధర పెరగడమేంటి? ఈ రెండిటివల్లా పేదోడికొచ్చే లాభమేమీ లేదు. డబ్బున్నోడు కొనుక్కునే పుత్తడి రేటు ఎంతున్నా కొనేవాడికే పట్టింపు. కానీ ఉల్లి ధర మాత్రం ఎప్పడూ అందుబాటులోనే వుండాలి. అప్పడే పేదోడి కడుపు నిండేది. ■



టపా

కదిలించిన కథ

ప్రసవం ఒక మరణం బెంగాలీ కథ నా మనసును కదలించింది. రచయిత హన్నా కేథరిన్ గొప్ప రచన. స్త్రీ ప్రసవ వేదన ఎంత తీవ్రమైనదో తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో సహాయం చేయాల్సిందిబోయి సమస్య తీవ్రతరం చేయడానికి చాలా మంది ఉంటారు. రచయిత గర్భవతుల సమస్యలు, పిల్లల సంరక్షణ వంటి విషయాల మీద దృష్టి పెట్టినవారు కావడం వలన స్త్రీ సమస్యలకు సాహితీ పరిమళం అద్ది చక్కటి కథ రూపంలో రాశారు. ఇటువంటి కథలు చదవడం వల్ల తోటివారి పట్ల విశాల దృక్పథం అలవడుతుంది. తెలుగు అనువాదం చేసిన దేవరాజుగారికి అభినందనలు. మంచి కథను ప్రచురణ చేసిన ప్రజాశక్తికి నా ధన్యవాదాలు.

పరుచూరు రాహుల్, మనోహర్, మంగళగిరి.

నాగరికత మాటున...

మన దేశం ప్రగతిలో ఎంతో ముందడుగు వేసినప్పటికి ఇప్పటికి మనిషికి ఎన్నో సమస్యలున్నాయని 'ఈ నాగరికులు' కథనం చక్కగా తెలిపింది. పేదవాడు ఎందరి మధ్యలో ఉన్నా ఒంటరే.ఈ వారం నవ్వుల్-పువ్వుల్ బాగున్నాయి.కొత్త జడ చాలా బాగుంది.

సుమలత, రాజంపేట.

బిజినెస్ ట్రిక్స్

ఎంత వస్తువుకైనా సరైన మార్కెట్ లేకపోతే పోటీ ప్రపంచంలో నిల దొక్కుకోవడం చాలా కష్టం. ఇదే సూత్రాన్ని ఫాలో అయ్యాడో గ్యారీ రాస్. రాళ్లకు నిజంగా చలనం ఉంటుందా అనేలా మార్కెటింగ్ చేయడం నిజంగా అద్భుతం.

నరేందర్, పశ్చిమ గోదావరి.

దేశానికే కళంకం

బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది కావస్తున్న సందర్భంగా ఒక్క కుంభకోణం, అవినీతి లేని పరిపాలన అందించామని డప్పు కొట్టుకున్న నరేంద్రమోడీ తన మంత్రి వర్గం లోని అవినీతిపరులు కనిపించకపోవడం నిజంగా దురదృష్టకరం. లలిత్‌మోడీ లాంటి మోసగాడు దేశ రాజకీయలను కుదిపేయడం నరేంద్ర మోడీ పరిపాలన డొల్లతనానికి అద్దం పడుతుంది. వ్యాపం స్కాంలోని వారందరు ఒక్కొక్కరుగా చనిపోవడం హారర్ సినిమాను తలపిస్తుంది.ఈ స్కాంలోని గవర్నర్ కుమారుడు చనిపోవడం చూస్తుంటే ఇక సామాన్య మానవుడికి రక్షణెక్కడ? సాక్షాత్తు చదువుల తల్లి స్మృతి ఇరానీ నకిలీ సర్టిఫికెట్లతో ఇటు ప్రజలను, అటు రాజ్యాంగాన్ని మోసం చేయడం విడ్డురంగా ఉంది. మొత్తం మీద బిజెపి అవినీతి గురించి సవివరంగా ఇచ్చారు.

రాము, కడప

వింత దారి

మనిషి నడవడానికి ఇబ్బంది పడే ఈ కాలంలో ఏటవాలుగా ఉన్న రోడ్డెక్కాలంటే ఎన్ని ఆపసోపాలు పడతాడో ఊహించు కుంటేనే నవ్వు వస్తుంది. అలాంటిది న్యూజిలాండ్‌లో డునెడిస్ నగరంలో ఏటవాలు దారి ఉండడం ఆశ్చర్యం. ట్రక్కే ఇల్లు చాలా బాగుంది. జీవితంతాం ప్రయాణం చేసేవారికి ఈలాంటి ఇళ్ళు చాలా సౌకర్యంగా, అద్భుతంగాను ఉంటుంది. టూరిజం వ్యాసం బాగుంది.ఈలాంటి వ్యాసాలు మరెన్నో అందించాలని కోరుకుంటున్నాను.

వెంకట్, గాజువాక, విజయవాడ.

ఈ సంచికలో....

రామేశ్వరం నుంచి..రాష్ట్రపతి భవన్‌కు..

కవర్ స్టోరీ —— 14

కలాం ఎవరు? యువ భారత్‌కు గురువా! పసి హృదయాల నుంచి మేధావి బుర్రలను ఎలా గెలవగలిగాడు! నవ భారత్‌కు ప్రథమ పౌరుడా? రాకెట్ ఇంజినీరింగ్ నుంచి మిస్సైల్ టెక్నాలజీ వరకు దేశాన్ని ఎలా గెలిపించాడు? చివరి శ్వాస వరకు పనినే ఆరాధిస్తూ కదిలిపోవడమే జాతికి నేర్పిన పాఠమా. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాన్ని గెలిపిస్తూ సాగిపోవడమే యువతకు చూపిన మార్గమా. రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్‌కు కలాం ఎలా చేరాడు? దేశపు గుండె సడిని నరనరానికి మోసుకెళ్లి ఏ సందేశం చేరవేశాడో ఈ వారం అట్టమీది కథలో.

స్ఫూర్తి 3
పడవ బడి

నవ్వుల్ పువ్వుల్ 4

యూత్ 5
కుక్క గారి రక్తదానం

సినిమా కబుర్లు 6
గంధర్వ గాయకుడు

వింత లోకం 8
ఈగల విందు

కవిత్వం 9
నెత్తుటి గోదావరి

చుద్దామా 10
ఇళ్ళే పై కప్పులు

యువ 11
మన బాడీ బిల్డర్

కథ 18
నేనెప్పుడో...

రుచి 21
కుజలాప్పం

బాలనేస్తాలు 22
పిల్లల మ్యూజియం

కొత్త పుస్తకాలు 24
వార్త రచన

అక్కడ కిడ్నీలు అమ్ముకుంటారు -13

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజమాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

బంగ్లాదేశ్‌లో వరదల కాలం వచ్చేసింది. కానీ, వరద బాధిత జిల్లా నాతోర్‌లాంటి చోట్ల పలకలు, నాగళ్లు అటకెక్కడం లేదు. పిల్లలతో పాటు పెద్దలు వారి ముందు నిలిచిన బడి పడవ ఎక్కుతున్నారు. పిల్లలతో అక్షరాలు దిద్దుస్తూ, పెద్దల సేద్యాన్ని సరిదిద్దుతూ ఆ పడవ బడులు సాగిపోతున్నాయి. పుస్తకాల లైబ్రరీల నుంచి కంప్యూటర్ ల్యాబ్‌ల వరకు అన్నింటినీ అందంగా అమర్చుకున్నాయి. అ..ఆ..ల నుంచి ప్రకృతి పాఠాల వరకు నేర్పిస్తున్నాయి. వరద ముప్పు ప్రాంతంలో 90 వేల కుటుంబాలను చదువు ఒడ్డెక్కిస్తూ సురక్షిత బతుకు ప్రయాణాన్ని చేయిస్తున్నాయి.

పడవ బడి

బంగ్లాదేశ్‌కు వరద తాకిడి ఎక్కువ. ఏటా జూలై నుంచి అక్టోబర్ వరకు వరదల బీభత్సం వల్ల వాయువ్య జిల్లాల్లోని లక్షల మంది నిరాశ్రయులవుతుంటారు. చదువులు అటకెక్కి విద్యార్థులకు ప్రాథమిక విద్య కూడా మిథ్యగానే మారుతుండేది. ప్రతి ఏటా అదే దృశ్యం. ఇలాంటి వరద ప్రాంతం నాతోర్ జిల్లాకు చెందిన వాడే మహమ్మద్ రిజ్వాన్. తన మిత్రులు ఇళ్లకే పరిమితమైతే తాను మాత్రం సొంత పడవలో బడికి వెళ్లి పాఠాలు నేర్చుకుని వచ్చేవారు. పునాదిలోనే చదువును వరదలు మింగి స్నేహితులు చేతి పనుల్లో చేరితే రిజ్వాన్ ఢాకా విశ్వవిద్యాలయంలో ఆర్కిటెక్చర్ పూర్తి చేసి మంచి అవకాశాలకు బాట వేసుకున్నారు. వారి వెనుకబాటుకు, తన ముందడుగుకు కారణం పడవే అనుకున్న రిజ్వాన్ పరిష్కారం లేదనుకున్న సమస్యకు బదులిచ్చారు.

1998లో 'శిదులై స్వానిర్వార్ సంఘ్'ను స్థాపించి గ్రామీణ విద్యను పడవెక్కించారు. 2002లో తన స్కాలర్‌షిప్ డబ్బు, ఓ పాత కంప్యూటర్, సొంత పడవను తాత్కాలిక పాఠశాలగా మార్చి తన గ్రామం విద్యార్థులకు పాఠాలు బోధించారు. విలువైన విద్యా కాలానికి వారధి వేశారు. అంతకు ముందు చూడని ఫలితాల్ని ఆ గ్రామం సాధించింది. స్కూల్ డ్రాపౌట్ల సమస్య తగ్గిపోయింది. 22 ఏళ్ల వయసులో రిజ్వాన్ చేసిన ఈ ఆలోచన బంగ్లా వరద ప్రాంతాల విద్యా ముఖచిత్రాన్నే మార్చివేసింది. తన ఆలోచన, ఫలితాల్ని వివరిస్తూ అంతర్జాతీయ దాతల సహాయాన్ని కోరారు. ప్రభుత్వమూ సహకరించడంతో శాశ్వతంగా పాఠాలు నేర్పడానికి అనువుగా పడవలు, సామగ్రి, సిబ్బందిని సిద్ధం చేసుకున్నారు. స్థానిక నోకా పడవలకు తన ఆర్కిటెక్చర్ పరిజ్ఞానంతో మార్పుచేర్పులు చేసి తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలకు అనుకూలంగా మార్చారు. 55 అడుగుల పొడవు, 11 అడుగుల వెడల్పు ఉండే వీటికి వాటర్‌ప్రూఫ్ కప్పును చేయించి వాటికి సోలార్ ఫలకాలను అమర్చారు. పడవ అవసరాలతో పాటు గ్రామావసరాలకు సౌర విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. భారీ వర్షాలకు తట్టుకునే ఈ పడవలు చూడటానికి తాబేలును పోలి ఆకర్షణీయంగా ఉంటాయి. దాంతో విద్యార్థుల హాజరు మెరుగ్గా ఉంటోంది. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోలార్ లాంతర్లను బహుమతిగా ఇస్తున్నారు. పడవలోనే ఉచితంగా చార్జింగ్ పెట్టుకుని ఇళ్లకు తీసుకెళ్లొచ్చు. మహిళలకు కూడా సౌర విద్యుత్ వాడకాన్ని అలవాటు చేస్తున్నారు.

ఇప్పటి వరకు 70 వేల మంది ఆ పడవ బడుల్లో ప్రాథమిక విద్యను పూర్తిచేశారు. కేవలం పుస్తక పాఠాలే కాకుండా వారి స్థానిక పరిస్థితులకు, జీవనశైలికి అనుగుణంగా ప్రాక్టికల్ పాఠాలను బోధిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి అనుకూల జీవన విధానం వంటివి చిన్న వయసులోనే వంట బట్టిస్తున్నారు. మహిళా వికాసానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. బాలికలను బడికి పంపేలా అవగాహన కలిగిస్తున్నారు. వ్యవసాయం, బాతుల పెంపకం వంటి వాటిలో శిక్షణనిస్తున్నారు. వరదకు నిలబడే వరి, చెరుకు సేద్యాలను పరిచయం చేశారు. మార్కెటింగ్ వ్యవస్థ తీరును వివరిస్తున్నారు. మహిళా హక్కులు, పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణంపై అవగాహన కలిగిస్తున్నారు. 22 బడులతో పాటు 10 గ్రంథాలయాలు, 7 మహిళాభివృద్ధి కేంద్రాలు, 5 చికిత్సాలయాలు పడవల్లోనే ఏర్పాటు చేశారు. 30 మందితో కూడిన తరగతి గదులుండే ఈ పడవల్లో రెండు అంతస్తులుండేలా రూపకల్పన చేస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆడియో విజువల్స్ వ్యవస్థ, ఇంటర్‌నెట్ సదుపాయంతో ఆధునిక విద్యకు ఆలవాలం చేశారు. ప్రస్తుతం 200 మంది సిబ్బంది, 300 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. రోజుకు 1800 మందికి పైగా తరగతులకు హాజరవుతున్నారు. ఒక్కో పడవలో రెండు కిలోమీటర్ల పరిధిలోని ప్రాంత విద్యార్థులకు పాఠాలు నిర్వహిస్తున్నారు. మరో 100 పడవ బడులను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు రిజ్వాన్. నదీ పరీవాహక ప్రాంతాల్లో మంచి ఫలితాల్ని సాధించిన ఈ ప్రాజెక్ట్‌ను కాంబోడియా, నైజీరియా, ఫిలిప్పైన్స్, వియత్నాం, జాంబియాలకు విస్తరించారు సామాజిక వేత్తలు. రిజ్వాన్ కృషితో అక్కడ ఏడాదంతా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న కుటుంబాలతో పాటు బడి బాట విడవని విద్యార్థులు వేల సంఖ్యలో ఉన్నారు. విద్యార్థుల ప్రాంతాలకు వెళ్లి పడవెక్కించుకు వచ్చి చదువు చెప్పే ఈ బడుల ఉద్దేశం 'బడికి విద్యార్థులు చేరడం కాదు, విద్యార్థుల దగ్గరకే బడి చేరాలి' అంటారు రిజ్వాన్. ✦

నవ్వుల్ – పువ్వుల్



ప్రశ్న

(ఇంటర్వ్యూ సాగు తోంది)

"అమెరికా నాల్గో ప్రెసిడెంటు ఎవరు?"

"చైనా మెదటి చక్రవర్తి ఎవరు?"

"జపాన్లో తొలి భూకంపం ఎప్పుడొచ్చింది?"

"బాబర్ పదమూడో భార్య ఎవరు?"

"హిమాలయాల్లో ఎన్ని పర్వతాలున్నాయి?"

అభ్యర్థికి విసుగెత్తింది..

"సార్... మీరు అడిగిన ప్రశ్నలకు మీకు కూడా జవాబు తెలియదని నాకు తెలుసు. మీకు జవాబు తెలిసిన ఒక ప్రశ్న నేను వేస్తాను. మీ ఐదుగురికి కలిపి లంచం ఎంత కావాలి?"

అదనం

రమేష్: ఎప్పుడు చూసినా వంటా వార్పు పుస్తకాన్ని ముందేసుకుని చదువుతున్నావు ఏంటీ సంగతి?

సురేష్: అదా! వంటొచ్చిన వాడికైతే అదనంగా 50 వేల రూపాయల కట్నం ఇస్తామంటున్నారు ఆడపెళ్లివారు.

రమేష్: ఆ.......

కస్టమర్

బట్టల కోసం షాపింగ్‌కు వెళ్ళిన రమ్య." రెండు వేల రూపాయలకంటే తక్కువ ఖరీదు చీరలు చూపించవద్దు. మంచి చీరలు చూపించు అన్నది

"అలాగే మేడమ్ ...మీరు కూర్చోండి.. మీ స్టేటస్‌కు తగినవే చూపిస్తాను అన్నాడు సేల్స్‌మాన్.

"సార్...మన షాపులో వెయ్యి రూపాయలకు మించిన ఖరీదైన చీరలు లేవు కదా. ఇప్పుడెలా సార్" అని ఓనర్ చెవిలో రహస్యంగా గొణిగాడు సేల్స్‌మేన్.

"పిచ్చివాడా వెయ్యి రూపాయలవే చూపించి రెండువేలని చెప్పాలి. కస్టమర్ శాటిస్‌ఫాక్షనే మనకు ముఖ్యం" అని చెప్పాడు ఓనర్.

గెట్ టు గెదర్

రాజు: నాన్నా స్కూల్లో ఒక చిన్న గెట్ టు గెదర్ ఉంది వస్తావా?

తండ్రి: చిన్న గెట్ టు గెదరా? అదేంటిరా?

రాజు: హా, అవును, కేవలం నువ్వూ నేను ఇంకా మా హెడ్ మాస్టరునూ అంతే.

పోయే కాలం



పిల్లల నుండి సమాధానాలు రాబట్టాలనుకున్నాడు

మాష్టారు: సూర్యుడు పడమట అస్తమించాడు. రాహుల్ ఇదేం కాల చెప్పు?

రాహుల్: సాయంకాలం సార్..

మాష్టారు: అది కాదు బాబు బాగా ఆలోచించి చెప్పు

రాహుల్: మరో ప్రశ్న అడగండి సార్

మాష్టార్: శ్రీ కృష్ణుడు కంసుడ్ని సంహరించెను. ఇదేం కాలం

రాహుల్: వాడికి పోయే కాలం సార్.....

ఐకమత్యం

మాస్టారు: ఎవరి సీట్లో వారు కూర్చుని పరీక్షలు రాయమంటే.? టీ తాగొచ్చే లోపు... అందరూ ఒకే చోట చేరారేంట్రా..?

స్టూడెంట్స్: ఐకమత్యమే మహాబలం అని మీరు చెప్పిన విషయం ఇప్పుడే గుర్తొంచ్చింది సార్...

చాలా కష్టం

తండ్రి: ఏరా నాని ఈ రోజు లెక్కల పేపర్లో ఎన్ని ప్రశ్నలిచ్చారు

నాని: యాభై మార్కులకు ఐదు ప్రశ్నలిచ్చారు డాడీ. చాలా కష్టంగా ఉన్నాయి.

తండ్రి: మరి నువ్వెన్ని రాశావు రా?

నాని: పైన రెండు కిందవి మూడు తప్ప అన్నీ రాశాను డాడి.

ప్రత్యేకం

బ్రాంబల్ రక్తదానంతో వంద ప్రాణాలు గట్టెక్కాయి. ఎనిమిదేళ్లుగా రక్తదానం చేస్తున్న బ్రాంబల్ ఓ శునకం. దాన్ని ఆదర్శంగా తీసుకుని యజమాని కూడా రక్తదానం చేస్తోంది. ప్రతి రొటీన్‌ను తప్పకుండా రక్తదానం చేస్తున్న బ్రాంబల్ ఇంగ్లండ్ జంతు రక్తదాతల్లో ప్రత్యేకం. బ్రాంబల్‌పై వచ్చిన కథనాలు ఆ తరహా రక్తదానంపై అవగాహన కలిగించి విశేష స్పందన తీసుకువచ్చాయి. ఈ ఏడాది రిటైర్ కాబోతున్న ఈ శునకంలా మరో 6500 కుక్కలు రక్తదానం చేస్తున్నాయి. బ్రిటన్ అంతటా జంతు రక్తనిధి సేవలు విస్తరిస్తున్నాయి.

కుక్క గారి రక్తదానం

మనలాగానే జంతువులకు కూడా శస్త్రచికిత్సలు చేస్తుంటారు. అప్పుడు వాటికి కూడా రక్తం అవసరమౌతుంటుంది. తోటి జంతువుల రక్తదానంతో వాటి ప్రాణాలు నిలబెట్టొచ్చు. జంతువుల రక్తంలో కూడా వర్గాలు ఉంటాయి. ఒక్క శునకాల్లోనే 8 రకాల ప్రధాన రక్తవర్గాలున్నాయి. ఏడాది వయసు నుంచి 9 ఏళ్ల వరకు అవి రక్తదానం చేయొచ్చు. కుక్కలు కనీసం 55 పౌండ్ల బరువుతో ఆరోగ్యంగా ఉండాలి. ఈ విషయంపై చాలా మందికి అవగాహన ఉండదు. దీనివల్ల చాలా పెంపుడు కుక్కలు సమయానికి రక్తం అందక చనిపోతున్నాయి. బ్రిటన్‌లోను ఇదే జరిగేది. మిడ్‌ల్యాండ్స్‌కు చెందిన జంతు సంరక్షకురాలు వెండీ బార్నెట్ వల్ల మార్పు వచ్చింది.

జంతువుల రక్తనిధి

అమెరికా, ఆస్ట్రేలియాల్లో జంతువుల రక్తదానం గురించి తెలుసుకున్న వెండీ బ్రిటన్‌లో పెంపుడు జంతువుల రక్తనిధిని 2007లో ప్రారంభించింది.

స్పందన అంతంత మాత్రమే ఉన్న సమయంలో డర్హమ్‌కు చెందిన మేరీ క్రాడ్డక్ తాను ముద్దుగా పెంచుకుంటున్న నల్ల లాబ్రాడార్ బ్రాంబల్ పేరును నమోదు చేయించింది. అప్పుడు దానికి తొమ్మిది నెలల వయసు. తొలి పుట్టిన రోజు జరుపుకోగానే తొలిసారి రక్తదానం చేసింది బ్రాంబల్. ఆ రక్తంతో నాలుగు శునకాల ప్రాణాలు నిలవడంతో ఆ వార్త మీడియాలో బాగా వ్యాపించింది. మిగతా పెట్ యజమానుల నుంచి స్పందన వచ్చి వాటి శునకాలతో నిర్భయంగా రక్తదానం మొదలు పెట్టారు. మిగతావాటిలా కాక ఏ బ్రేక్ తీసుకోకుండా టంచనుగా ఏడాదికి నాలుగు సార్లు బ్రాంబల్ రక్తదానం చేస్తోంది. ఈ మధ్యే 26వ సారి రక్తదానం చేసి రికార్డు సృష్టించింది. సుమారు 104 శునకాల ప్రాణాలు దక్కాయి.

ప్రతి విడతలోను 450 మిల్లీలీటర్ల రక్తాన్ని తీస్తారు. అది నాలుగు శునకాలకు ఉపయోగపడుతుంది. మనకు వాడే పరికరాలు, రక్త సంచులనే వాటికీ ఉపయోగిస్తారు. రక్తసంచుల్లో 450 మిల్లీ లీటర్ల రక్తం గట్టకట్టకుండా యాంటీ కోగులెంట్ ద్రవం ఉండటం వల్ల పూర్తిగా నింపాల్సిందే. అందుకే చిచువా, స్పేనియల్స్ వంటి బ్రీడ్‌లు రక్తదానానికి పనికిరావు. పూర్తిగా వ్యాక్సినేషన్ చేయించిన కుక్కల నుంచి మాత్రమే రక్తాన్ని సేకరిస్తారు. ఇతర దేశాలకు తీసుకువెళ్లిన శునకాల నుంచి కూడా రక్తాన్ని తీసుకోరు. విదేశీ వాతావరణంలో కొత్త రకాల సూక్ష్మజీవుల వ్యాప్తి ఉండటమే కారణం. దీనివల్లే మేరీ బ్రాంబల్‌తో విదేశీ యాత్రలను వదులుకుంది. రక్తదానం చేస్తున్న సంగతి తనకు తెలిసినట్టుగా ప్రవర్తిస్తుంది బ్రాంబల్. వైద్యులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కదలకుండా ఉంటుందట. బ్రాంబల్‌ను చూసి తానూ రక్తదానం మొదలెట్టింది మేరీ. కానీ బ్రాంబల్‌తో పోటీ పడలేనని తాను కేవలం 11 సార్లు మాత్రమే ఇవ్వగలిగానని నవ్వుతూ చెబుతుంది. రక్తదాత ట్యాగ్‌ను కాలర్‌కు తగిలించుకుని పార్కుల్లో, వీధుల్లో బ్రాంబల్ తిరుగుతుంటే అందరూ దానిపై ప్రేమ కనబరుస్తారని, దాన్ని చూస్తే చాలా గర్వంగా ఉంటుందని మేరీ అంటుంది. మరో ఆరు నెలల్లో బ్రాంబల్‌కు 9 ఏళ్లు నిండబోవడంతో రక్తదానం చేసే వయసు దాటిపోతుంది. అయితే, జంతు రక్తదానంపై ప్రచారానికి బ్రాంబల్ సాయం తీసుకుంటామని రక్తనిధి స్థాపకురాలు వెండీ చెబుతోంది. రిటైర్‌మెంట్ తర్వాత బ్రాంబల్ 'పెట్స్ యాజ్ థెరపీ' సంస్థలో పనిచేయనుంది. ఆస్పత్రులు, శరణాలయాలు, పాఠశాలలు, సంరక్షణ కేంద్రాల కార్యక్రమాల్లో పాల్గొని అక్కడి వాతావరణాన్ని ఉల్లాసభరితం చేయనుంది. ✦



'జీవిత మధు భాండమ్ము పగిలే... తునాతునకలై..' అనే లైలా మజ్ను చిత్రంలోని పాటగాని, మల్లీశ్వరి చిత్రంలో 'పరుగులు తియ్యాలి.. గిత్తలు ఉరకలు వెయ్యాలి..' భానుమతితో యుగళ గీతంతోపాటు ఘంటసాల ప్రతిపాట అమృతతుల్యమైందే. బాలాంత్రపు రజనీ కాంతారావు గారి స్వర సారథ్యంలో 'స్వర్గసీమ' చిత్రంతో ప్రారంభమైన పాటల ప్రహసనం. గుణ సుందరికథ, స్వప్న సుందరి, టింగురంగా ప్రేమ, చండీరాణి చిత్రాల వరకూ హ్యాపీగా సాఫీగా సాగినాయి. దేవదాసు చిత్రం సుబ్బరామన్, యం.యస్. విశ్వనాథన్ స్వర రచనలో పాడిన పాటలు తెలుగు తమిళ పరిశ్రమల్లోనే కాదు, ఉత్తర భారతదేశమంతా మార్మోగిపోయాయి. సైగల్, మహమ్మద్ రఫీ లాంటి ఘనాపాటీలు ఘంటసాల వారి సుస్వర మాధురీ ఝరికి నీరాజనాలు పలికారు.

గంధర్వ గాయకుడు

ఘంటసాల పాట పాడినా, పద్యం పాడినా అందులో ఇమిడివున్న అక్షరాలు ప్రాణం పోసుకుంటాయి. స్వరమాధుర్యం, భావప్రకటన,తాదాత్మం, పాత్ర ఔచిత్యం అన్నీ ప్రతిఫలింప చేస్తుంది ఆయన స్వరం. కృష్ణా జిల్లా గుడివాడ దగ్గరున్న చిన్న గ్రామం చౌటుపల్లిలో 1922 డిసెంబర్ 4న జన్మించాడు ఘంటసాల. తండ్రి సూర్యనారాయణ సంగీతాభిమాని.తండ్రి పాడుతుండగా బాల ఘంటసాల నృత్యం చేస్తుండేవాడు. పసివయసులోనే తండ్రి మరణించడంతో సీతారామశాస్త్రి వద్ద స్వర సాధన చేస్తున్న ఆ బాలుడ్ని విజయనగరం మహారాజా కాలేజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్సులో చేర్పించారు. ఆ రోజుల్లో ద్వారం వేంకటస్వామి నాయుడు ఆ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించేవారు. ఆకలి దప్పికలు తీర్చుకోవడమే కష్టతరమైన ఆ రోజుల్లో సంగీత సాధన గగనం అయిపోయింది. పట్టిన పట్టు విడవకుండా విజయనగరం వీధుల్లో జోలిపట్టి భిక్ష అడుక్కుంటూ అకుంఠిత దీక్షతో గురుదేవుల మెప్పుని పొందగలిగాడు.

ఘంటసాల చిన్నతనం నుండి తనదైన వ్యక్తిత్వం కలిగివుండేవాడు. దేశభక్తి, సామాజిక సేవ ఎక్కువ. సాటి మనిషికి సాయపడలేని జీవితం వృథా అన్న భావనతో ప్రతి చిన్న కష్టానికి విపరీతంగా స్పందించేవాడు. మహాత్మాగాంధీ పిలుపునందుకుని 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు పాలయ్యాడు. బళ్ళారిలో ఆలిపూర్ జైల్లో పద్దెనిమిది మాసాలున్నాడు. ఆ సమయంలో రాజకీయ నాయకులు గొప్ప దేశ భక్తులతో పరిచయ భాగ్యం కలిగింది. జైలు నుంచి వచ్చిన తర్వాత పెదపులివర్రు గ్రామానికి చెందిన సావిత్రిని వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలోనే ప్రముఖ పాటల రచయిత సముద్రాలతో పరిచయం కలిగింది. ఘంటసాల పాటలు విని ముగ్ధుడైన సముద్రాల సినీ పరిశ్రమలోకి వస్తే రాణించే అవకాశాలున్నాయని చెప్పాడు. అప్పటికే ఘంటసాల కర్ణాటక సింగర్‌గా ఆలిండియా రేడియోలో పాడుతూ మంచి పేరు తెచ్చుకున్నాడు.

ఘంటసాల గొంతు విని హెచ్.ఎమ్.వి. రికార్డింగ్ కంపెనీకి పరిచయం చేశాడు. 'సీతారామ జననం' సినిమాలో ఘంటసాల గొంతు కోరస్‌లో పరిచయం అయ్యింది. (స్వర్గసీమలో మొదటి గాత్రం) అనతి కాలంలోనే ఘంటసాల ప్రతిభని గుర్తించి 'లక్ష్మమ్మ' సినిమాకి సంగీత సారథ్యం వహించే బాధ్యత అప్పగించాడు. పాత్రలకు సరిపడే విధంగా నటుల గొంతుని ప్రతిఫలిస్తూ పాడటం మాస్టారే మొదలుపెట్టాడు. మీర్జాపూర్ రాజుగారి భార్య అప్పటి అగ్రనటి కృష్ణవేణి 'మనదేశం' చిత్రానికి (ఎన్టీఆర్‌తో తొలి చిత్రం) సంగీత సారథ్యం అప్పగించారు. పాటలు కొత్త పుంతలు తొక్కాయి. మాటలు మధురంగా పలకడంలోనూ భావాన్ని సూటిగా గుండెలకు హత్తుకొనేలా పలకడంలో ఆయనకి ఆయనే సాటి.

ఆయన సంగీత సారథ్యం వహించిన ప్రతి చిత్రం ఆణిముత్యమే. పాతాళభైరవి, మాయాబజార్, లవకుశ, పాండవ వనవాసం, రహస్యం, గుండమ్మ కథ, పరమానంద శిష్యుల కథ. 1950-1960లో ఘంటసాల వారి సంగీత ప్రభంజనం కొనసాగింది. 1961లో పెండ్యాల వారు జగదేక వీరుని కథ చిత్రం కోసం కంపోజ్ చేసిన 'శివశంకరీ శివానంద లహరి..' ప్రపంచంలో సంగీత ప్రేమికులందర్నీ అలరించిన పాట. సింగిల్ టేక్‌లో పాడి రికార్డు సృష్టించాడు. కన్నడ సంగీతంతో పాటు హిందూస్థానీ, కర్ణాటక క్లాసికల్ శైలిలో అనితర సాధ్యంగా కంపోజ్

చేయబడింది. ఆ పాటను ఘంటసాల పాడిన విధానం, ఆ పాటలోని రసఝరిని చూసి తెలుగు, తమిళ, హిందీ పరిశ్రమలు ఆశ్చర్యపోయాయి.

'కుల దైవం' చిత్రంలో 'పయనించే ఓ చిలుకా ఎగిరిపో.. పాడై పోవును గూడు..' అనే పాట ఘంటసాల మాస్టారే పాడారు. ఇదే పాటని 'బాబీ' హిందీ చిత్రంలో మహ్మద్ రఫీ పాడారు. 'కుహుకుహు బోలె కుయాలియా..' హిందీలో పెద్ద సంచలనం అయితే, ఘంటసాల పాట విన్న రఫీ ఓ అంబాసిడరు కారుని బహుమతిగా ఇచ్చాడు. లతా మంగేష్కర్ ఘంటసాలతో ఒక పాట పాడాలని కోరుకుంటున్నానని ఆశను వ్యక్తం చేసింది. అప్పట్నించీ దక్షిణాది, ఉత్తరాది భాషా చిత్రాల దర్శకనిర్మాతలు తమ చిత్రాల్లో పాడమని ఎంతో ప్రాధేయపడ్డారు. కాని సున్నితంగా తిరస్కరించేవారు.

మాస్టారిలో మరో గొప్ప సుగుణమేమిటంటే 'అందరం ఈ సినిమా తల్లిని నమ్ముకునే వచ్చాం. ఇక్కడే బ్రతుకు దెరువు చూసుకుంటున్నాం. అందరూ ప్రముఖ గాయకులే. కఠోర సాధన చేసి వచ్చిన వారే. వారి వారి గాత్ర ధర్మాన్ని అనుసరించి ఎవరు పాడాల్సినది వారు పాడాలి." అనేవారు. మొదట్లో ఒకటి అరా ప్రొడ్యూసర్ల బలవంతం మీద పాడిన తర్వాత పి.బి శ్రీనివాస్, పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది వంటి వారిని ప్రోత్సహించారు. పౌరాణిక, సాంఘిక, జానపద, చారిత్రాత్మక చిత్రాల్లో తెలుగు, తమిళ పాటలు కలిసి 13,000 పైచిలుకు పాటల్ని ఆయన పాడినట్లు నమోదు అయ్యింది. రఘురామయ్య, పి.సూరిబాబు, సి.యస్.ఆర్ ఆంజనేయులు, చిత్తూరు నాగయ్య పట్ల అపారమైన భక్తి భావంతో వ్యవహరించి గౌరవించేవాడు. ఘంటసాల మాస్టారు ఆరోగ్యంగా వున్న సమయంలో రామకృష్ణ, యస్.పి. బాలసుబ్రహ్మణ్యం రంగ ప్రవేశం చేశారు. వీరిని చాలా ప్రోత్సహించి ఆశీర్వదించాడు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారి కోరిక మేరకు ఆస్థాన గాయకునిగా అనేక భక్తి గీతాలు ఆలపించారు. దేశ భక్తి గీతాలు, పద్యాలు, భగవద్గీతకు తన స్వీయ స్వర రచనతో ప్రాణం పోశాడు. అలాగే ప్రైవేట్ ఆల్బమ్స్ పుష్పవిలాపం, కుంతి విలాపం, ఎంకినాయుడు బావ, గుత్తివంకాయ కూర, పోలీసు వేంకటసామి గీతాలు ఆపాత మధురాలు.

తరగని నిధులు

అనార్కలి చిత్రంలో రాజశేఖరా., 'కాళిదాసు'లో శ్యామలాదండకం, 'చిరంజీవులు'లో కనుపాప కరవైన బ్రతుకెందుకో.., 'పునర్జన్మ'లో ఎవరివో నీవెవరివో.., 'సువర్ణ సుందరి'లో హాయి హాయిగా ఆమని సాగే రాగమాలిక ఇలా ఎన్నో గీతాలు ఆయన తరగని సుస్వర సంపదలు.

దేశవిదేశాల్లో..

ఇంగ్లండ్ మరియు జర్మనీ దేశాల్లో తన ట్రూపుతో ప్రదర్శనలు ఇచ్చి ప్రామాణికమైన భారతీయ సంగీత మాధుర్యాన్ని రుచి చూపించి సంగీతాభిమానుల్ని ఘంటసాల మంత్రముగ్ధుల్ని చేశాడు. 1970 ఫిబ్రవరి 1 వ తేదిన లాల్ బహుదూర్ స్టేడియంలో ముప్పైవేలకు పైచిలుకు ప్రేక్షకుల సమక్షంలో ఘనమైన సన్మానాన్ని అందుకున్నాడు. మాస్టర్ వేణు స్వరపరిచిన 'భద్రాచలం రామదాసు వైభవం' ప్రైవేట్ ఆల్బమ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో వుంటూనే పూర్తి చేశాడు. 2003లో ఘంటసాల వారి పేరిట భారత ప్రభుత్వం విడుదల చేసిన పోస్టల్ స్టాంప్ ఆయన పట్ల గౌరవానికి తార్కాణం. యునైటెడ్ స్టేట్స్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ అక్టోబరు 6న 2014 ఉత్తర అమెరికాలో స్టాంప్‌ను న్యూయార్క్ నుంచి విడుదల చేసింది. రవీంద్ర భారతి ఆడిటోరియం ప్రాంగణంలో ఘంటసాల కళావేదిక యస్.పి బాల సుబ్రహ్మణ్యం సారథ్యంలో నిలువెత్తు విగ్రహం నెలకొల్పింది. ఘంటసాల మాస్టారి పేరిట ఏర్పాటు చేసిన అవార్డులు వరుసగా జేసుదాసు, బాలు, సరస్వతిలకు ఇవ్వడం జరిగింది. పద్మశ్రీ అవార్డుతో ఘంటసాల మాస్టారిని గౌరవించడంతో అవార్డుకే గౌరవం దక్కింది.

ఆయన ప్రతిపాటకూ పూర్ణాయుష్షే

ఆయన రోజుకి ఒకే పాట పాడేవారు. ధవళ వస్త్రాలతో తాంబూల సేవనంతో రికార్డింగ్ థియేటర్లో అందర్ని పేరు పేరున పలకరించి కుశల ప్రశ్నలు వేసేవారు. కవి గారితో చర్చించి మధ్యాహ్నం అల్పాహారం సేవించి తరువాత ఓ గంట మననం చేసుకొంటూ ఆర్కెస్ట్రాతో కలిసి పాడుతూ ఏ సాయంత్రానికో పాట పూర్తయ్యేది. అందరితోపాటు పాట వింటూ, వారితో పాటు ఆనందిస్తూ వాద్య కళాకారుల్ని ప్రశంసిస్తూ ప్రోత్సహించడం నిత్య కృత్యాలే. పాటకి ప్రాణం పోసేవారు. పూర్ణాయుష్షు నింపేవారు.

'ఎక్కడ వున్నా ఏమైనా.. మనమెవరికి వారై వేరయినా..
నీ సుఖమే నేకోరుచున్నా..' అన్నారు 'మురళీ కృష్ణ' చిత్రంలో. అభిమానులు, అశేష సంగీత ప్రియులు అదే కోరుకుంటున్నారు. 51 సంవత్సరాలకే మనందరికీ దూరం కావడమే బాధాకరం.

-ఇమంది రామారావు,
9010133844

భార్య,పిల్లలతో...

పి.బి.శ్రీనివాస్,బాలుతో....

లీల, జానకితో...

ఎన్టీఆర్‌తో, ఎయన్నార్‌తో....

ఈగల విందు

ఆఫ్రికాలోని విక్టోరియా సరస్సు ప్రాంత వాసులకు వర్షాకాలం మంచి విందును అందిస్తోంది. కోట్ల సంఖ్యలో ఈగల గుంపు ఆ సరస్సు నుంచి ఆ ప్రాంతంలో తిరుగుతుంది. ఆ ఈగలతో వేడివేడిగా తయారు చేసే బర్గర్‌లంటే స్థానికులకు ప్రియం. చాలా తేలిగ్గా పాత్ర పెట్టగానే పోగయ్యే ఈగలు మంచి పోషకాహారాన్ని అందిస్తాయని చెబుతారు. నల్లగా కాల్చి చేసిన వాటి బర్గర్‌లు మిగతా మాంసాల బర్గర్‌ల కంటే ఆరేడు రెట్ల పోషకాల్ని అందిస్తాయని అంటారు. ఒక్కో పట్టీలో 5 లక్షల వరకు ఈగలుంటాయి. వాటిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఏ పరికరం అవసరం లేదు. పిల్లలు కూడా ఈగల్ని పట్టేందుకు ఉత్సాహం చూపుతుంటారు. కరువు పరిస్థితులపుడు ఈ ఈగల విందే వారి ప్రాణాల్ని కాపాడుతుంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకం ఈగల వంటకం చేస్తారు. ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతాయి.

కాలికి చేయి కలిపి



చైనాలో ఈ మధ్య ఓ సరికొత్త శస్త్ర చికిత్స చేసి ఓ కార్మికుడి చేయి పోకుండా కాపాడారు. తెగిన చేతిని కాలికి కలిపి కుట్లు వేసి పాడవుకుండా జాగ్రత్త చేశారు. హునాన్ ప్రావిన్స్ చాంగ్షాలోని ఓ కర్మాగారంలో జరిగిన ప్రమాదం వల్ల జౌ అనే కార్మికుడి ఎడమచేయి తెగిపడింది. హుటాహుటిన జియాంగ్యా ఆస్పత్రికి అతణ్ని తరలించారు. తీవ్రంగా గాయపడటంతో అతడి చేతి నరాలు బాగా దెబ్బతిన్నాయి. ఆ చేతిని తిరిగి అతికిద్దామంటే చచ్చుబడిన ఆ భాగం వల్ల ప్రమాదం ఎక్కువవుతుందని డాక్టర్లు భావించారు. విడిగా ఉంచుదామంటే రక్త సరఫరా లేక పనికిరాకుండా పోతుంది. దీనికి పరిష్కారంగా డాక్టర్ టాంగ్ జుయి ఆ చేతికి రక్త సరఫరా అందేలా జౌ కాలికే కలిపి కుట్లు వేశాడు. నెల రోజుల తర్వాత చేతి భాగం గాయం మానిన తర్వాత తిరిగి అతికించారు. ప్రస్తుతానికి వేళ్లను కదిలించగలుగుతున్న జౌ త్వరలోనే పూర్తిగా కోలుకుంటాడని వైద్యులు చెప్పారు. రెండేళ్ల క్రితం కూడా ఈ తరహా శస్త్రచికిత్సనే డాక్టర్ టాంగ్ నిర్వహించి ఓ కార్మికుడికి జీవితాన్ని ఇచ్చాడు. చేయి లేకుంటే పని దొరకడం కష్టమని భావించిన జౌ ఇప్పుడు భరోసాగా ఉన్నాడు.

వింత లోకం

కోడి మందిరం

మధ్య జావాలోని మాగెలాంగ్ కొండల్లో ఓ ప్రార్థనా మందిరం ఉంది. కోడి పుంజును పోలి ఉండే ఆ నిర్మాణం ఏ మతానికి చెందదు. మతాలతో సంబంధం లేకుండా అక్కడకు వెళ్లి ప్రార్థనలు చేస్తుంటారు స్థానికులు. గెరెజా అయ్యమ్ (కోడి ప్రార్థనా మందిరం) అని పిలుచుకునే పూర్తికాని ఆ నిర్మాణం వద్దకు సందర్శకులను ఆకట్టుకునేది దాని చుట్టూ ఉండే అటవీ ప్రాంతమే. ఇండోనేషియా అటవీ ప్రాంతంలోని ఓ భాగమది. డానియేల్ అలమ్సుజ అనే వ్యక్తి దాన్ని నిర్మించాడు. 1989లో తన భార్య ఊరికి వచ్చిన డానియేల్‌కు ఆ కొండ ప్రాంతం కలలో చూసినట్టుగా గుర్తు వచ్చిందట. అక్కడ ఓ చర్చిని కట్టాలనిపించి 1994లో నిర్మాణాన్ని మొదలెట్టేశాడు. కానీ నిధుల్లేక 2000లో విడిచిపెట్టేశాడు. అయినప్పటికీ... బౌద్ధులు, క్రైస్తవులు, ముస్లింలు అక్కడికి వెళ్లి వారి రీతిలో ప్రార్థనలు చేసుకుంటారు. నిజానికి పావురం ఆకారంలో రూపొందించాల నుకుంటే తీరా పూర్తయ్యాక కోడిని పోలి ఉండటంతో దాన్ని కోడి మందిరంగానే పిలుస్తున్నారు.

కవిత్వం

నెత్తుటి గోదావరి

చన్నటి చినుకులు
మధ్యలో ఎండ
శరీరం ఉక్కపోతలో
జీవన సంక్షోభం
ప్రకృతికి శరీరానికి మధ్య ఘర్షణ
మనుష్యులంతా
అంత:సంక్షోభంలో వున్నారు
ఆ కళాకారుడు
తనతలను నేలమీద వుంచి
అనంతమైన ఫీట్స్ వేస్తున్నాడు
నరాలన్నీ తెంచుకొంటేతప్ప
జనం చప్పట్లు కొట్టడంలేదు.
జనం ఉన్మాదాన్ని ప్రేమిస్తున్నారు
ఉద్రేకాన్ని స్వాగతిస్తున్నారు
జనాన్ని మెప్పించడం కోసం
అతని మెడనరాలు తెగాయి
ఆ నొప్పికి ఉపశమనంగా
అతడు మత్తుమందులు సేవించాడు
చివరకు అతని అంతిమయాత్ర
మూడుపదులు తీరకముందే అయ్యింది.
ఆ పుష్కరాల ఘాట్స్‌లో
మనుష్యులు నీటికంటే
మురికినే ఆస్వాదిస్తున్నారు
నమ్మకం అంధత్వం
అది మనుష్యులను అనాలోచితులను చేస్తుంది.
మత్తులో ముంచుతుంది.
మరణించడాన్ని కూడా అది
ఆహ్వానిస్తుంది
స్వర్గలోకానికి ద్వారాలు తెరిచినట్లు
ఉద్బోధిస్తుంది
మరో పక్క రాయలసీమలో
కరువు విలయతాండవం ఆడుతోంది
మనుష్యులు ప్రవాహాలుగా
ఊళ్ళు విడిచి వెళుతున్నారు
ఊళ్ళు బీళ్ళయ్యాయి
శరీర శుద్ధికి కూడా
నీళ్ళులేక విలవిలలాడుతున్నారు
రాజ్యం పీతలు, చేపలు
వడ్డించుకు తింటుంది
భోగభాగ్యాలతో తులతూగుతోంది
నడిచే ఎ.సి. గదుల్లో
సౌఖ్యాలు అనుభవిస్తుంది.
పురోహితులు
'సర్వే జనం సుఖినో భవంతు'
అని నమ్మబలుకుతున్నారు
నాలుగు అబద్ధాలతో
ధన, కనక, వస్తువాహనాలు
సంపాదిస్తున్నారు
మరొపక్క
విద్యాలయ్యాల్లో ఆత్మహత్యలు
రాగింగ్ పేరుతో రౌడీలరాజ్యం
పాలకవర్గ కులాల కర్రపెత్తనం
రాజకీయపార్టీలకు ఆయుధ సామాగ్రి
యువకులు పార్టీలరంగుతో
అరాచక కార్యకలాపాలు
తోడేళ్ళకు మేకలబలి
కాపలాదారులుగా పాలకులు
రాజ్యం సుఖభోజ్యం అయ్యింది
కులం పెత్తందారుల
దారుణకృత్యాలు నిరాఘాటం
తాకట్టులో విద్య
రోడ్లన్ని రక్తమయమయ్యాయి
అన్ని అకృత్యాలకు
దేవుడు పసుపు జెండా ఎత్తుతున్నాడు.
కాషాయాంబరాలు
రుద్రాక్షమాలలు
ఉర్ధ్వపుండరాలు, అడ్డగీతలు,
అర్ధదిగంబరాలు
దేశసంస్కృతిగా ప్రచారం అవుతున్నాయి
నీరు, మనస్సు, మెదడు
మురికయ్యాక మిగిలింది ఏముంది?
అందుకే
జ్ఞాన విప్లవం రావాలి
ప్రజలు ప్రజ్వలన శక్తులు కావాలి
తమన్నితాము నిర్మించుకోవాలి
అప్పుడే జీవన సౌరభాలు.
వివేకంలేని జీవితం వ్యర్ధం
యాచకత్వ దేశసౌభాగ్యానికి గొడ్డలివేటు
ప్రకృతి అర్ధం కాకపోతే
సంక్షుభిత జీవనం
మనిషి తన్ను తాను తెలుసుకోవడమే విముక్తి

(గోదావరి పుష్కర మృతులకు అంకితం)

-డా॥ కత్తి పద్మారావు

ఇళ్లే పైకప్పులు

ఇరుకైన ఆ బుల్లి ద్వీపం ఇపుడో టూరిస్ట్ అట్రాక్షన్. రెండెకరాల సాంటాక్రజ్ డెల్ ఐలెట్ ద్వీపమంతా ఖాళీ లేకుండా పరుచుకున్న ఇళ్లు తప్ప మరేం ఉండవు. ఇళ్లే పైకప్పులుగా ఉన్న ఈ దీవిలో చూడ్డానికి ఏముంది అనేవారికి పర్యాటకుల సమాధానం కొత్తగా అనిపిస్తుంది. సామాజిక సంబంధాల శిఖర దర్శనం ఇక్కడ దొరుకుతుంది. చుట్టూ సముద్రం తప్ప మరేమీ కనబడని ఇక్కడ విహారం కచ్చితంగా కొత్త అనుభూతినిస్తుంది. ఇది ప్రపంచంలోనే అతి జనసమ్మర్దమైన ద్వీపం.

కొలంబియా దేశానికి చెందిన సాంతాక్రజ్ డెల్ ఐలెటో మొర్రోస్కీటో గల్ఫ్ ప్రాంతంలో ఉంటుంది. సాన్ బెర్నాండో కరీబియన్ ద్వీప సముదాయంలో ఇది ఒక భాగం. ప్రధాన భూభాగానికి పక్కన చిన్న చుక్కలా కనిపిస్తుంది. పై నుంచి చూస్తే రకరకాల రంగుల కప్పులతో దీవంతా గొడుగు కట్టుకున్నట్టు అనిపిస్తుంది. సముద్రంలోకి విస్తరించుకున్న ఇళ్ల నిర్మాణాలతో కృత్రిమ ద్వీపంగా పొరబడతారు. చుట్టూ ఉన్న ద్వీపాలు దీని కన్నా చాలా రెట్లు పెద్దవి. రెండెకరాలు కూడా చోటు లేని ఇక్కడ ఏకంగా 1200 మంది జీవిస్తున్నారు. 0.012 చదరపు కిలోమీటర్ల స్థలంలో ఇంత మంది ఉన్నారు. అంటే చదరపు గజానికి రెండున్నర లక్షల మంది జనాభా సాంద్రత అన్నమాట. ఇది మన ముంబై, థానే నగరాలున్న సాల్సెట్టె ద్వీప జన సాంద్రతకు 5 రెట్లు ఎక్కువ. ఈ చిట్టి దీవిపై ఏకంగా 90 గృహాలు, 2 స్టోర్లు, ఒక్క స్కూల్ ఉన్నాయి.

వీటితోనే దీవంతా ఆక్రమించుకుపోయింది. మరేమీ కట్టడానికి అంగుళం భూమి కూడా లేదు. ఎత్తైన నిర్మాణాలు ఇక్కడ కనిపించవు. అన్ని దిగువ మధ్య తరగతి కుటుంబాల ఆవాసాలే.

నేరమనే మాటే లేదు!

ఒకదానికొకటి అంటి పెట్టుకుని ఇళ్లు గొలుసు కట్టులా ఉంటాయి. సన్నని రోడ్డు మార్గాలు అన్ని పజిల్‌లా ఒకదానికి ఒకటి అల్లుకుపోయి ఉంటాయి. ఆ వీధులు బాగా తెలిసినవారు మాత్రమే అనుకున్న గమ్యానికి సరైన దారిలో వెళ్లగలరు. ఇళ్ల మధ్య నుంచే వంకర టింకర దారులతో మార్గాలుంటాయి. కార్లు కాదు గదా బైకులు నడపడం కష్టమే. కనీసం మంచి నీళ్లు కూడా లభ్యం కాని ఈ దీవిలో ఏ చీకు చింతా లేకుండా స్థానికులు కలిసి మెలిసి బతుకుతున్నారు. కొలంబియా నేవీ బృందమే మూడు వారాలకోసారి మంచినీటిని సరఫరా చేస్తుంది. విద్యుత్ కూడా 5 గంటలే అందుతుంది. అది కూడా ఒక్క జనరేటర్ మీదే నడుస్తుంది. అంత మంది జనాభా ఉన్నా ప్రతి ఒక్కరు ఆత్మీయంగానే మెసులుతారు. ఈ దీవిలో ప్రతి ఒక్కరు మరొకరికి పరిచయస్తులే. వారి మధ్య ఏ విబేధాలు ఉండవు. నేరాలనే మాట అక్కడ వినబడవు. డ్రగ్ మాఫియా, అరాచక శక్తుల పోరుతో గడగడలాడే కొలంబియాలో ఇది వింతే. పోలీస్ స్టేషన్ కాదు కదా ఒక్క పోలీస్ అక్కడ కనబడరు. ఇక్కడ స్కూల్లో 80 మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడి చట్ట ప్రకారం ఈ స్కూల్లో ఒక సెక్యూరిటీ గార్డు ఉంటాడు. అయినా అతడికి ఏ పనీ ఉండదు. విద్యార్థులు చక్కటి క్రమశిక్షణ కలిగి, తమకు తామే క్యూ లైన్లలో సాగుతారని అధ్యాపకులు గర్వంగా చెప్పుకుంటారు. పనుల నుంచి వచ్చాక అందరూ వీధి సందుగొందుల్లో కూడి కబుర్లు చెప్పుకుంటారు.

సంతోషాల స్వర్గసీమ

ఎక్కువగా పిల్లలతో కనిపించే ఇక్కడ ఏ ఇంటి ముందు చూసినా ఆటల్లో పడిన చిన్నారుల కేరింతలు వినిపిస్తాయి. ఇక్కడ ఇళ్లకు తాళాలు వేసి ఉంచడం చాలా అరుదు. పనులకు వెళ్లేవారు తలుపులను తెరిచే వెళ్లిపోతారు. ఇక్కడ దొంగతనాల మాటే వినిపించదు. ప్రతి విషయాన్ని తోటివారితో పంచుకుంటూ ఉమ్మడిగా బతుకుతారు. సామాజిక జీవనం ఇక్కడ పైస్థాయిలో కనిపిస్తుంది. ఇక్కడ భౌతిక లోటు పాట్లు మాత్రమే కనిపిస్తాయి. మానసికంగా వీరు చాలా పరిణతి చెందినవాళ్లలా మాట్లాడతారు. సంపాదన, ఆస్తులు వంటి విషయాలు తమకు చెందినవి కాదన్నట్టు వ్యవహరిస్తారు. పేదరికపు ఛాయలు ఉన్నా సౌకర్యాలు, సదుపాయాల జాడ లేకున్నా అందరూ స్వచ్ఛంగా నవ్వుతూ కనిపిస్తారు. ఎవరినీ కదిపినా చాలా సంతోషంగా ఉన్నట్టు చెబుతారు. ఆ దీవిని విడిచివెళ్లాలని ఉందని ఒక్కరూ సమాధానం చెప్పరు. అది వారికి స్వర్గసీమ. అందరు అనుకున్నట్టు స్వర్గం అనగానే విలాసవంతమైన జీవనం, భోగభాగ్యాలు ఇక్కడ లెక్కలోకి రావు. ఎంత సంతోషంగా, ప్రశాంతంగా జీవితాన్ని అనుభూతి చెందుతూ గడుపుతున్నారనేదే వారి స్వర్గానికి లెక్కలు. సముద్రాన్నే నమ్ముకుని బతుకుతున్న స్థానికులు ఈతలో మేటి. పిల్లలు కూడా పడవలను తేలిగ్గా నడిపేస్తారు. ఇదే వారి ప్రధాన ఆదాయ మార్గం. పర్యాటకులను చుట్టూ ఉన్న ద్వీపాలకు బోట్ ప్రయాణాలు చేయించడం, డైవింగ్‌లో మెళ

చుద్దామా

కువలు నేర్పడం, చేపలు పట్టడం వీరి ప్రధాన వృత్తులు. సన్నటి గొట్టాన్ని నోటిలో ఉంచుకుని నీటిలో ఈదులాడే స్నోర్కెలింగ్ శైలి ఈత ప్రత్యేకమైంది. పర్యాటకులకు దాని అనుభూతిని పంచుతారు. ఈ దీవి చుట్టు పక్కల ప్రాంతం స్నోర్కెలింగ్‌కు అత్యంత అనువైనది.

150 ఏళ్ల నుంచే..

పక్కనే ఉన్న ముకురా దీవి పర్యాటక హోటళ్లు, రిసార్ట్‌లకు పేరు. చాలా మంది అక్కడ పనులకు వెళతారు. తమ దీవి ప్రధానంగా నివాసాలకే వినియోగిస్తారు. వైద్యుడు కూడా లేని ఈ దీవిలో ఎవరైనా మరణిస్తే పక్క దీవుల్లోనే అంత్యక్రియలు నిర్వహిస్తారు. కొలంబియాలోని కార్తాగెనాకు రెండు గంటల ప్రయాణ దూరంలో ఉన్న ఈ దీవికి పర్యాటకులు ఫెర్రీలలో వెళతారు. సాంటా క్రజ్ డెల్ ఐలెటో అతి చిన్న వయసున్న ద్వీప జనావాసం. 150 ఏళ్లకు క్రితం వరకు ఆ దీవి ఎవరికీ అంతగా తెలిసేది కాదు. దగ్గరలోని బారు ద్వీప ప్రాంతపు ఓ జాలర్ల బృందానికి చేపలు పట్టేందుకు వెళుతుండగా ఇది కనిపించింది. అక్కడ కాసేపు విరామం తీసుకున్న వారికి అక్కడి వాతావరణం చాలా ఉపశమనంగా అనిపించింది. ఆ రాత్రి అక్కడే నిద్రించిన వారందరికీ మంచి కలలు వచ్చాయట. అప్పటి నుంచి చేపల వేట ఉన్నప్పుడల్లా అక్కడకు వచ్చి సేద తీరడం మొదలెట్టారు. ఆ తర్వాత తాత్కాలిక విడిదిగా వాడేవారు. కొందరు కుటుంబాలతో సహా ఇక్కడ ఇళ్లను ఏర్పాటు చేసుకుని నివసించడంతో క్రమంగా వలసలు పెరిగాయి. అలా పెద్ద జనావాసంలా మారి జనాభాతో కిక్కిరిసి పోయింది. తొలుత ఇక్కడకు వచ్చిన జాలర్ల బృందంలోని పెద్దల కుటుంబాలు ఇప్పటికీ అక్కడే ఉన్నాయి. వారి కుటుంబీకులను చాలా గౌరవంగా చూసుకుంటారు. వీరిలో చాలామంది మంచి డైవర్లుగా గుర్తింపు పొందారు. ద్వీప సముదాయంలోని మిగతా ఎనిమిది దీవుల్లోలేని ప్రత్యేకతే ఇక్కడ వేగంగా వలసలు విస్తరించడానికి కారణం. చుట్టూ ఉన్న దీవుల్లో దోమల బాధ ఎక్కువ. కానీ ఇక్కడ దోమనేది కనిపించదు. సముద్ర మీదుగా వీచే గాలులే దీనికి కారణమని భావిస్తారు. ఆఫ్రో-కొలంబియన్లు ఎక్కువగా ఉండే ఈ దీవి ఇపుడు అంతర్జాతీయ పర్యాటకులతో కళకళలాడుతోంది. ఎటువంటి ఘర్షణలు లేకుండా ఇక్కడివారు దీవంతా ఒకే కుటుంబంగా గడపడమే సందర్శకుల పర్యటనలకు ప్రధాన కారణం. వీరి జీవన శైలిని పరిశీలిస్తూ, ఇక్కడివారి ఆత్మీయ ఆతిథ్యంలో కొన్నిరోజుల పాటు గడిపి సంతోషంగా పర్యాటకులు ఇళ్లకు చేరుకుంటారు. వీరి ప్రశాంత జీవన శైలిపై అనేక డాక్యుమెంటరీలు వచ్చాయి.

✦

మన మహిళా బిల్డర్

బాడీ బిల్డింగ్ పోటీలు మగాళ్లకేనా. కండలు తిరిగిన శరీరం వారికి మాత్రమే సొంతమా. శరీరాన్ని రాతి శిల్పంలా మార్చే శక్తి వారికే పరిమితమా. మరి అశ్విని వాస్కర్ మాటేమిటి. తొలి భారతీయ మహిళా బాడీ బిల్డర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఇండియన్ బాడీ బిల్డింగ్ ఆటకు కొత్త కట్స్‌ను తెప్పించింది.

విదేశాల్లో మహిళా బాడీ బిల్డర్ల గురించి విన్నాం. కానీ, మన దేశంలో ఆ మాట నిన్న మొన్నటి వరకు వినబడేది కాదు. అసలు ఆ ఆలోచనే ఎవరూ చేసేవారు కాదు. ఎవరైనా మహిళలు జిమ్‌లకు వెళ్లారంటే ఒళ్లు తగ్గించుకోడానికి, ఆరోగ్యం కోసమే కానీ పోటీల ఊహే అసలేరాదు. కేంద్రీయ మత్స్య పరిశోధన విద్యా సంస్థలో సీనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేస్తున్న అశ్విని కూడా ఇలానే జిమ్‌కు వెళ్లింది. అధిక బరువుతో సతమతమవుతున్న ఆమె ముంబైలోని ఓ జిమ్‌కు క్రమం తప్పకుండా వెళ్లేది. చిన్న చిన్న బరువులను ఎత్తి తన బరువు తగ్గిందో లేదో చూసుకునేది. తొలుత అక్కడికే తన కసరత్తులు పరిమితం అని ఆమె కూడా అనుకునేది. కానీ జిమ్ కబుర్లలో బాడీ బిల్డర్ల సంగతులే ఎక్కువగా వినబడేవి. వారి కోసం ప్రత్యేకంగా పోటీలు జరుగుతాయని, వాటికి శిక్షణ తీసుకునేవారు వ్యాయామశాలల్లో హీరోలుగా కొలవబడతారని తెలుసుకుంది. బాడీ బిల్డర్ల ఫొటోలు చూస్తూ కసరత్తులు చేయడానికే పరిమితమవకుండా బాడీ బిల్డింగ్ పోటీలు ఎక్కడ జరిగినా చూసి వచ్చేది. అలా 2013లో ఓ పురుషుల పోటీని చూసేందుకు వెళ్లిన ఆమెకు ఓ వార్త చెవిన పడింది. త్వరలో మహిళా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించబోతున్నారనేది ఆమెను నిద్ర పట్టనివ్వలేదు. హెవీ వెయిట్స్ ఎత్తుతూ తన శరీరాన్ని శిల్పంలా చెక్కడం మొదలెట్టింది. దాని మీద దృష్టి నిలిపేందుకు ఉద్యోగాన్ని వదిలిపెట్టింది. కొన్ని మాసాల్లోనే తీరైన శరీరంతో జిమ్ సిబ్బందిని ఆశ్చర్యపరిచింది. కానీ, పోటీల్లో పాల్గొనాలంటే నెలకు 20 వేల వరకు ఖర్చు చేసి డైట్ తీసుకోవాలి. ఆమెది మధ్య తరగతి కుటుంబం కావడంతో పెను భారమైంది. అప్పుడే ఆమెకు ఓ ఆలోచన తట్టింది. మహారాష్ట్ర కొంకన్‌లోని తన స్వగ్రామం రాయ్‌గఢ్‌లోని హనుమాన్ వ్యాయామశాల గుర్తుకు వచ్చింది. తక్కువ ఖర్చుతో వ్యాయామాన్ని నేర్పించే శిక్షకుడు రాజేశ్ అంగద్ దగ్గర చేరింది. పురుష బాడీ బిల్డర్లతో పోటీ పడుతూ బరువులు ఎత్తుతున్న అశ్విని ప్రతిభ గమనించిన ఆయన ఆశ్చర్యపోయాడు. అక్కడ కఠోరమైన శిక్షణతో తాను అనుకున్న బాడీకి మెరుగులు దిద్దుకుంది అశ్విని. అయితే, పోటీల్లో పాల్గొనడానికి ప్రధాన అడ్డంకి వస్త్రధారణ. బికినీని పోలివుండే దుస్తులు ధరించి శరీరాన్ని ప్రదర్శించాల్సి ఉండటంతో కాస్త వెనుకంజ వేసింది. ఆమె గ్రామీణ నేపథ్యం, మధ్య తరగతి జీవితం వెనుకడుగు వేసేలా చేశాయి. కానీ అశ్విని తండ్రి, సోదరులు ధైర్యాన్ని నింపి మద్దతునిచ్చి ఆమెను పోటీల్లో పాల్గొనేలా చేశారు. 2014 డిసెంబర్‌లో పూణెలో జరిగిన తొలిసారిగా నిర్వహించిన పోటీల్లో పాల్గొని 5వ స్థానం సాధించింది. ఇప్పటికే 7 అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న ఈ ముప్పై ఏళ్ల మహిళా బాడీబిల్డర్ ఆయా వేదికలపై దేశ పతాకాన్ని గర్వంగా ఎగురవేసింది. మరెందరో మహిళలు బాడీ బిల్డింగ్ వృత్తిలోకి వచ్చేలా స్ఫూర్తినివ్వడమే కాక, శిక్షణనిస్తూ మరికొందరు మహిళా బాడీ బిల్డర్లను తయారుచేస్తోంది. భారత బాడీ బిల్డింగ్ క్రీడలో ఓ కొత్త శకానికి నాంది పలికిన అశ్వినికి దక్కాల్సిన స్థాయిలో ప్రోత్సాహం లభించడంలేదు. ఇప్పటికీ స్పాన్సర్లు లేరు. కుటుంబ సహకారంతో ఖర్చు విషయంలో నెట్టుకొస్తున్న ఆమెకు ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహం అందాలని బాడీ బిల్డింగ్ సమాఖ్యలు కోరుతున్నాయి. ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా కఠోర శిక్షణకే అంకితమైన అశ్విని త్వరలోనే దేశంలో మహిళా బాడీ బిల్డింగ్‌కు మంచి రోజులు వస్తాయని ఆశిస్తోంది.

✦

మెత్తని మట్టితో చేసిన ఆలయ నిర్మాణాలు, సామాన్య మానవునికి దగ్గరగా ఆలయ నిర్మాణాలు, ఖజురహో, కోణార్కులకు తీసిపోని క్లిష్టమైన ఆకారాలు, కృష్ణుడి జీవిత విషయాలు, రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పురాణాలు కళ్లకు కట్టినట్లు ఉండే శిల్పాలు, నాటి మానవుని జీవనశైలిని తెలిపే చిత్రాలతో బిస్నుపూర్ నగరం పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

ఆలయాల నగరం బిస్నుపూర్



దక్షిణ బెంగాల్‌లోని బిస్నుపూర్‌లో మల్ల రాజులు తమ ఇష్టదైవమైన విష్ణువు కోసం అనేక దేవాలయాలు నిర్మించారు. పూర్వం అక్కడ రాళ్లు ఉండేవికావు. అందుకే బంక మట్టితో చేసిన ఇటుకలతో ఆ దేవాలయాలను నిర్మించారు. ఇప్పుడు మనం చూస్తున్న టెర్రకోట కళల కోసమే మల్లరాజులు తమకు వారసత్వంగా సంక్రమించిన ఆస్తినంతా ధారపోశారు. కలకత్తాకు 200 కిలోమీటర్ల దూరంలో బిస్నుపూర్‌కు దిగువన ప్రాచీన రాజుల దుర్గం చూస్తే మనదేశంలో దేవాలయాల్లో ఎన్ని ఉత్సవాలు జరుగుతాయో అర్థమౌతుంది. సౌభాగ్యమనేది ఒక్క వైభవం, ఐశ్వరంతోనే కాదు, ప్రకృతి పోషణ పట్ల ఉన్న ఆలోచన వల్ల కూడా వస్తుంది. నగరంలో ఉద్యానవనాలు, మంచినీటి ట్యాంకులు నిర్మించి ఒక మంచి ప్రణాళికను వేశారు. ఏపుగా పెరిగిన చెట్లతో గ్రామాలు ప్రశాంతంగా ఉండేవి.

ఆలయ నిర్మాణాన్ని 16 వశతాబ్దంలో ప్రారంభించారు. బిస్నుపూర్ ఆలయాల్లో ఆశ్చర్యకరమైన విషయమేంటంటే బెంగాల్ పూరిగుడిసెల్లా వీటి పైకప్పు గుమ్మటంలా, చూర్లు వేళ్లాడుతుంటాయి. దేవుణ్ని తమ ఇంటికి దగ్గరగా తీసుకురావడానికి, సామాన్య మానవుణ్ని అర్థం చేసుకోవడానికి వీలుగా వారు ఆ విధంగా కట్టేవారు. రాతితో నిర్మాణాలు చేసేవారు, శిల్పులు తలుపులపైనా, స్తంభాలపైనా అతి క్లిష్టమైన ఆకారాలను చెక్కేవారు. ఇవి మధ్యప్రదేశ్‌లోని ఖజురహోకు, ఒరిస్సాలోని కోణార్క్‌కు ఏమాత్రమూ తీసిపోకుండా ఉన్నాయి. ఆ యుగాన్ని స్వర్ణయుగంగా చెప్పుకునేవారు.

అలువియల్ మట్టితోనే ఆలయాలు...

మల్ల రాజులు బ్రిటీషువారి, ముస్లిముల ఆగమనానికి ముందు 9 శతాబ్దాలు బిస్నుపూర్‌ను పాలించారు. వారు వచ్చిన తొలి రోజుల్లో మల్ల రాజులు మిలిటరీ సామర్థ్యానికి మారుపేరుగా ఉండేవారు. వీరు మిలిటరీ సామర్థ్యంలో మెసపటోమియన్లకు సమానులనడానికి ఆధారాలు కూడా ఉన్నాయి. వారి వివిధ దశలను చూస్తే రకరకాల కళల (భవననిర్మాణం, శిల్పకళ, సంగీతం) అభివృద్ధికి వారి ప్రోత్సాహం మనకు తెలుస్తుంది. వీర హింబిర్, రాజా రఘునాథ్ సింగ్, వీర సింగ్ వంటి వారి కాలంలో బిస్నుపూర్ బెంగాల్ నాగరికతకు ముఖ్య కేంద్రాలలో ఒకటిగా ఉంది. టెర్రకోట అందమైన నూతన ఆలోచనలకు ఒక ఉదాహరణ. దీనిని పూర్తిగా అలువియల్ మట్టితోనే కట్టారు. ఒక్క రాయిని కూడా ఉపయోగించలేదు. అయినా మంచి నైపుణ్యంతో కట్టుదిట్టమైన, అందమైన భవనాలను తమదైన శైలిలో నిర్మించారు. మెత్తటి మట్టితో చేసిన, బాగా కాల్చిన ఇటుకలతో ఆలయాలు, ఇతర కట్టడాలను నిర్మించారు. వాటిపైనే శిల్పాలను చెక్కారు. వీటిని గోడలమీద అతికించడానికి బంకలాంటి ప్రత్యేకమైకన పట్టీలను తయారుచేసేవారు. వాటిని నిపుణులైన కార్మికులు సున్నం, చింతగింజల జిగురు, ఇంకా జిగురుగా ఉండే ఇతర గింజలు, బాగా పండిన అరటి పండ్లు, బెల్లంతో తయారుచేసేవారు.

బిస్నుపూర్‌కు దిగువన కొన్ని కిలోమీటర్ల దూరంలో కోట ప్రదేశంలో 26 ఎరుపు రంగు ఆలయాలు ఉంటాయి. వీటిని ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రక్షిస్తోంది. వీటిలో కొన్ని చాలా పురాతనమైనవి. వీటి చుట్టూ గడ్డి, చెట్లు, పొదలు పెరిగి అవి వాటి లోపలి భాగాలకు కూడా వ్యాపించాయి.



రాస్ మంచ

అతిపురాతనమైన ఇటుకలతో కట్టిన ఆలయం రాస్ మంచ. దీనికి అందమైన కమాన్‌లతో 108 ద్వారాలు, స్తంభాల గది, విశాలంగా ఉంటుంది. దూరం నుంచి చూస్తే ఈ ఆలయం మంటల్లో కుదులుతున్న రథంలా కనపడుతుంది. ఈ ఆలయంలో ఒక హాలు, గర్భగుడి ఉన్నాయి. ఇక్కడ ఒక పొడవైన, పోనుపోను సన్నగా ఉండే పిరమిడ్ స్తంభం ఉంది. ఈ స్తంభం పైకప్పుకు తాకే చోట నాలుగువైపులా గుడిసె ఆకారంలో చిన్న గోపురాలు ఉంటాయి. ఇవి బెంగాల్ గ్రామ సంస్కృతిని ప్రతిబింబింపజేస్తాయి. ఈ ఆలయాన్ని 1587లో వీర హింబిర్ నిర్మించారు. హోలీ పండుగ రోజు ఆతిథ్యమివ్వడానికి ఈ ఆలయాన్ని కట్టించారు. మల్ల వంశంలో హింబిర్ కాలాన్ని స్వర్ణయుగంగా చెప్పుకునేవారు. రాస్ మంచలో గోడలు, తలుపులు, స్తంభాల మీద అందంగా చెక్కిన శిల్పాలు దైవచింతనను ప్రేరేపించేవిగా ఉంటాయి. ఈ శిల్పాలన్నీ కూడా భాగవత పురాణానికి సంబంధించినవి. కృష్ణుడు రకరకాల భంగిమలలో కనిపిస్తాడు. వెన్న దొంగగా, పశువుల కాపరిగా, ఫ్లూటు వాయిస్తున్నట్టుగా, నీటి ఆటలను చూస్తున్నట్టుగా, గోపికలతో ఆడుతున్నట్టుగా.. ఇవి శిల్పులకు, భవనాలను నిర్మించేవారికి, నిపుణులైన కార్మికులకు స్ఫూర్తిగా, శాశ్వత వనరుగా ఉన్నాయి. బిస్నుపూర్‌కు సంవత్సరమంతా వెళ్లొచ్చు. అయితే ఆగస్టులో ఝుపాన్ పండుగ సమయంలోగానీ, డిసెంబరు చివరి వారంలో బిస్నుపూర్ మేళా సమయంలోగానీ చాలా బాగుంటుంది.

విచిత్రంగానో, వింతగానో అనిపించినా ప్రతి మనిషికి, ప్రదేశానికి ఏదో ఒక పేరు తప్పక వుంటుంది. 'కిడ్నీ బ్యాంక్' సరిగ్గా అలాంటిదే అనుకోవచ్చు. కాకపోతే ఇది ఆ మారు మూల పల్లెటూరు అసలు పేరు కాదు. చుట్టు పక్కల ఎవరికి కిడ్నీ అవసరమైనా అక్కడ దొరుకుతుంది కాబట్టే ఆ పేరు వచ్చింది. ఆ గ్రామస్తులు అనేకమంది తమ కిడ్నీని అమ్ముకున్నారు. ప్రస్తుతం వారు ఒక కిడ్నీతోనే బతుకులు ఈడుస్తున్నారు.

అక్కడ కిడ్నీలు అమ్ముకుంటారు

ఒకప్పుడు నేపాల్‌లోని ఆ కుగ్రామం పేరు 'హోక్సే'. పదేళ్ల నుంచి ఆ ఊరును 'కిడ్నీ బ్యాంక్' అని, 'కిడ్నీ లోయ' అని పిలుస్తున్నారు. కిడ్నీ సమస్యలున్న ధనికులు ముందుగా మధ్యవర్తులతో మంతనాలు జరుపుతారు. వీరు హోక్సేలోని పేదలకు మాయ మాటలు చెప్పి కిడ్నీ అమ్ముకునేలా చేస్తారు. ఆపరేషన్ బల్ల మీద వుండేది అర్ధగంటే అయినా కిడ్నీ తొలగించిన తాలూకు కత్తిగాటు, అది ప్రసాదించే రోగాలు మాత్రం జీవితాంతం వెంటాడతాయి.

మాయమాటలు

పిల్లలకు చదువు చెప్పించాలన్నా, సొంత జాగా కొనుక్కోవాలన్నా, హఠాత్తుగా కుటుంబంలో ఎవరికైనా జబ్బు చేసినా హోక్సే వాసుల మదిలో మెదిలేది కిడ్నీనే. ఒకవైపు తమ అవసరాలు మరోవైపు మధ్యవర్తులు చెప్పిన మాయమాటలు వారిని ఒక కిడ్నీతో బతికేందుకు సిద్ధం చేస్తాయి. వాస్తవానికి ప్రతి మనిషికి రెండు కిడ్నీలు వుంటాయి. అయితే ఒక కిడ్నీతో కూడా బతుకు బండిని బరువుగా లాగించేయొచ్చని చెప్తారు. కిడ్నీ దానం చేసినా తిరిగి పెరుగుతుందని కూడా అబద్ధమాడేస్తారు. కిడ్నీ అమ్మితే పెద్ద మొత్తం చేతికొస్తుందని... ఇల్లో పొలమో కొనుక్కోవచ్చనో, పిల్లలకు మంచి చదువులు చెప్పించొచ్చనో ఆశలు కల్పిస్తారు. ఇవేవీ కాకుంటే... ఏదైనా జబ్బు చేసి ఆస్పత్రిలో చేరినప్పుడు తెలీకుండానే కిడ్నీలు పోగొట్టుకున్న వారూ ఈ గ్రామంలో వున్నారు. రెండు కిడ్నీలూ చేజార్చుకుని శవాలైనవారూ వున్నారు.

రోగాల పాలే

కిడ్నీ అమ్మితే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని నమ్మబలుకుతారు మధ్యవర్తులు. అది నమ్మిన అమాయక గ్రామస్తులు కిడ్నీ అమ్ముకుంటారు. అర్ధగంటలో ఆపరేషన్ పూర్తయినా మంచం వీడడానికి మూడు నెలలు పడుతుంది వారికి. ఇక ఆ తర్వాత కాళ్ల నొప్పులు, ఆయాసం, అధిక రక్తపోటు ... వంటి సమస్యలు వారిని వెన్నాడతాయి. ఎక్కువ సేపు పనిచేయలేక, దూరం నడవలేక, బరువులు మోయలేక రోజువారీ కూలి పనులకు దూరం కాసాగారు. వీటికి తోడు ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడు పంటలు సరిగా పండకపోతే పౌష్టికాహారం కరవై రక్తహీనత ఆవహిస్తుంది వీరిని. దాంతో బరువు పనులకు, పొలం పనులకు పోలేక   ఎక్కడోచోట కూర్చుని పళ్లో కాయలో అమ్ముకుంటూ బతుకుతున్నవారూ తక్కువ కాదు. ఒకవేళ రోగాల బాధలు తట్టుకోలేక ఆస్పత్రికి పోదామన్నా భయపడేవారూ వున్నారు. ఇలా కిడ్నీలు అమ్మడం నేరం కనక డాక్టర్లు, అధికారులు తమను ప్రశ్నిస్తారనే భయంతో రోగాలను ముదరబెట్టుకుంటున్న వారూ తక్కువ కాదు.

అరకొర పైకమే

ముందుగా కిడ్నీ అమ్మకానికి ఒప్పించడానికి పెద్ద మొత్తం ఆశ చూపుతారు దళారీలు. తీరా ఆస్పత్రిలో కిడ్నీ తీసేశాక... చేతిలో పెట్టేది మాత్రం కొద్ది పైకమే. బుదాధోకి అలా మోసపోయిన వాడే. అతనికి ముందుగా 5 వేల డాలర్లు ఇప్పిస్తానని మాటిచ్చాడు మధ్యవర్తి. ఆపరేషన్ అయ్యాక ముట్ట చెప్పింది మాత్రం వెయ్యి డాలర్లే. కొందరు గ్రామస్తులు కిడ్నీ అమ్మగా వచ్చిన డబ్బుతో చిన్నపాటి ఇళ్లు కట్టుకున్నారు. ఇక ఆ ఇంట్లోనే ఆఖరివరకు ప్రశాతంతగా బతకొచ్చని ఆశపడ్డారు. అయితే ఇటీవల నేపాల్‌లో వచ్చిన వరుస భూకంపాలు వారి ఆశలమీద నీళ్లు చల్లాయి. ఎన్నో కష్టాలకోర్చి, రోగాలు భరిస్తూ కట్టుకున్న ఇళ్లు నామరూపాల్లేకుండా పోవడంతో వారికి మిగిలింది తీరని శోకమూ, కన్నీళ్లే,

కిడ్నీ అమ్మకాలు కొనుగోళ్ల గురించి ప్రభుత్వాలకు, అధికారులకు తెలిసినా, అందుకు కారణమైన వారిని అడపా దడపా అరెస్టులు చేసి జైళ్లలో పెడుతున్నా... స్వచ్ఛంద సంస్థలు స్థానిక ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నా... ఆ ప్రయత్నం సముద్రంలో నీటిబొట్టు చందమే. ✦

కలాం ఎవరు? యువ భారత్‌కు గురువా! పసి హృదయాల నుంచి మేధావి బుర్రలను ఎలా గెలవగలిగాడు! నవ భారత్‌కు ప్రథమ పౌరుడా? రాకెట్ ఇంజినీరింగ్ నుంచి మిస్సైల్ టెక్నాలజీ వరకు దేశాన్ని ఎలా గెలిపించాడు? చివరి శ్వాస వరకు పనినే ఆరాధిస్తూ కదిలిపోవడమే జాతికి నేర్పిన పాఠమా. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాన్ని గెలిపిస్తూ సాగిపోవడమే యువతకు చూపిన మార్గమా. రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్‌కు కలాం ఎలా చేరాడు? దేశపు గుండె సడిని నరనరానికి మోసుకెళ్లి ఏ సందేశం చేరవేశాడో ఈ వారం అట్టమీది కథలో.

రామేశ్వరం నుంచి .. రాష్ట్రపతి భవన్‌కు ...

కలగనడమే కదలికనేది కలాం సూత్రం. గొప్ప స్వప్నాలకు, గొప్ప ఆలోచనలకు, గొప్ప కార్యాలకు, గొప్ప జీవితాలకు కలలు కనాలి. ఆ కలలతో అసాధ్యాలను ఆవిష్కరించాలి. జ్వలించడమే జీవించడమనేది కలాం పాఠం. గొప్ప లక్ష్యాలకు, గొప్ప ప్రయత్నాలకు, గొప్ప మార్పులకు, గొప్ప విజయాలకు మన హృదయాలు జ్వలించాలి. ఆ జ్వాలలతో అడ్డంకులను జయించాలి. ఓడిపోవడమే గెలుపు తావనేది కలాం భాష్యం. గొప్ప పనులకు, గొప్ప సంకల్పాలకు, గొప్ప యుద్ధాలకు, గొప్ప సమాజాలకు ఓటములు చవిచూడాలి. ఆ ఓటములతో విజయాలను అందుకోవాలి. అత్యుత్తమం తప్ప మరేదీ కలగనని, దానికై జ్వలించి, ఓటములు ఎదురైనా వెనుకడుగు వేయని డాక్టర్ అబ్దుల్ కలాంను నవ జాతి గురువుగా కొలవక మునుపు ఆయనో అత్యుత్తమ శిష్యుడు. తల్లిదండ్రులు, మిత్రుడి తండ్రి, బావ, యజమాని, విద్యా గురువులు, ప్రాజెక్ట్ అధినేతలు, మత గురువులు, సంగీత ఆచార్యినులు చివరకు చిన్న పిల్లలు, చుట్టూ ఉన్న ప్రకృతి వరకు అందరీ దగ్గర శిష్యరికం చేశాడు. ఆ శిష్యరికంలోనే గురుస్థానం ప్రజ్వలనను దర్శించాడు. నవ భారత గురువుగా అవతరించాడు.

తొలి గురువులు

అఖండ భారతావనిలో రామేశ్వరం బిందువంతటి ద్వీపం. ఆ బిందువునే విశాల భారత హృదయంగా మార్చేశాడు కలాం. ఆ ద్వీపంలో ఓ పేద కుటుంబంలో 1931 అక్టోబర్ 15న కలాం జన్మించాడు. ప్రతి కుటుంబానికి ఉన్నట్టు వారికీ ఓ మతం ఉంది. మిగతా మతాల విజ్ఞానానికి అక్కడ చోటు ఉంది. కలాం తండ్రి జైనులాబ్దిన్ ప్రతి ఉదయం మసీద్‌కు వెళ్లి వస్తూ తన మిత్రుడు రామేశ్వరం ఆలయ పూజారి పక్షి లక్ష్మణ శాస్త్రిని కలిసి వచ్చేవారు. ఖురాన్ పక్కనే భగవద్గీతకు పవిత్ర స్థానం, గౌరవం ఆ ఇంట్లో ఉండేది. అవి రెండు వేర్వేరు మతాల వారివనే ఊహే లేని వాతావరణం. ధనుష్కోటికి హిందూ యాత్రికులను తీసుకువెళ్లే బోటు యజమాని జైనులాబ్దిన్ పేదవారికి ఇంటి భోజనం ఏర్పాటు చేయడం మామూలే. అందుకే కలాంకు మతమంటే స్నేహాల్ని అల్లే సంతోష మార్గమైంది. తండ్రే అత్యుత్తమ మత గురువయ్యాడు. నాస్తికుడినని చెబుతూనే ఖురాన్, వేదాలు, భగవద్గీత, బైబిల్ నుంచి విజ్ఞానాన్ని స్వీకరించాడు. మత విద్వేషకుల్లా కాక ఆ గ్రంథాలను స్వీయాభివృద్ధికి, జాతి హితానికి

సరిగ్గా ఉపయోగించాడు. కలాంతో పాటు ఆరుగురు సంతానంతో ఇల్లు గడవడం కష్టమైనా అన్నార్తుల ఆకలిని అర్థం చేసుకుని వినమ్రంగా సేవ చేసిన తల్లి ఆశియమ్మ వ్యక్తిత్వ వికాస గురువైంది. తండ్రి మిత్రుని కొడుకు రామనాథమే కలాం ప్రాణ మిత్రుడు అయ్యాడంటే స్నేహ బంధాలకు ఆ ఇంట ఎంతటి విలువ ఉండేదో తెలుస్తుంది. మతమంటే తెలీని ఆ ప్రాణ మిత్రుల్ని విడదీసేందుకు ప్రయత్నించిన మతపిచ్చి మాస్టారికి పాఠం నేర్పిన లక్ష్మణ శాస్త్రిని ప్రతి ఒక్కరిలో దర్శించాలని కోరుకున్నాడు. పసి హృదయానికైన అప్పటి గాయాన్ని ముదిమి వయసులోను మరవలేక మిత్రుని తలుచుకుంటూ కవితను రాసుకున్నాడు. గురువు ఎలా ఉండకూడదో ఈ పాఠం నేర్పుతుంది. చెట్టాపట్టాల్ వేసుకుని మిత్రులతో చలాకీగా తిరుగుతున్న కలాం మనసు లక్ష్యం కోసం జ్వలించేలా చేసింది బావ అహ్మద్ జలాల్. తాను నేర్చుకున్న నాలుగు ఇంగ్లీషు ముక్కల్ని కలాంకు నేర్పుతూ గొప్ప లక్ష్యాల గురించి ఆశగా చెబుతూ ఉత్తమ విద్యకై ప్రజ్వలిస్తున్న జలాల్ హృదయం కలాంను కదిలించింది. పొద్దున్నే నాలుగు గంటల కల్లా లెక్కల తరగతికి హాజరై ప్రయత్నాన్ని మొదలెట్టేశాడు కలాం. తండ్రికి సాయం చేసేందుకు పేపర్ బాయ్‌గా పనిచేశాడు. పక్క ఊరు, ఢిల్లీ, అమెరికా గురించి, తిరునాళ్లు, సైన్సు సదస్సులు గురించి విషయాల్ని పత్రికల ఏజెంట్ షంషుద్దీన్ చెబుతూ ఉంటే విద్య అంటే కేవలం పాఠ్య పుస్తకాలే కాదని గ్రహించాడు. అప్పటి నుంచి ముందుగా వార్తాపత్రిక పూర్తిగా చదివి కలాం పేపర్లు పంపిణీ చేసేవాడు.

రామేశ్వరం దాటి...

అలా రామేశ్వరం రోజులు గడిచి తిరుచిరాపల్లి సెయింట్ జోసెఫ్ కళాశాలలో గొప్ప కలలతో అడుగుపెట్టాడు కలాం. అరవిందం, శివ ప్రకాశన్ బాల మిత్రులతో కలిసి అప్పుడప్పుడు తరగతులకు

బంకు కొట్టేవాడు. అలా చేయాలని అంటాడు కూడా. జ్వలించడమంటే, నిద్ర పట్టకుండా కలల్ని కనడమంటే లక్ష్యంకై పరుగే జీవితం కాకూడదని తేల్చేశాడు. సాధారణ జీవితాన్ని ఆస్వాదించాలని అంటాడు. ఇక్కడే కాలం, జీవితం ఘర్షణను వివరించి వాటి సంబంధాన్ని తేలిక చేస్తాడు. కాలం గమనించకుంటే జీవితం వృథా అయిపోతుంది. జీవితంలో పడిపోతే కాలం కరిగిపోతుంది. వీటి రెండిటినీ బ్యాలెన్స్ చేస్తూ సాగడమే సాధన అంటాడు కలాం. కాలేజీలో శివసుబ్రహ్మణ్యం, అయ్యాదురై సాల్మన్‌ల పాఠాలు ఆకాశానికి ఆశ పెంచాయి. ఇంటికి తీసుకెళ్లి స్వయంగా భోజనం వడ్డించిన గురు ప్రేమ గురువు ఎలా ఉండాలో తొలిసారి నేర్పింది. వారి వాత్సల్యాన్ని కలిపి పెట్టిన ప్రతి ముద్ద వృథా పోకుండా ఎయిరోనాటికల్ ఇంజినీర్ సీటు సాధించాడు. ప్రొఫెసర్లు స్పాండర్, కేఎంపీ పండులై, నరసింగ రావుల శిష్యరికంలో సైన్సును జీర్ణించుకున్న కలాంను మద్రాస్ ఐఐటీ గొప్ప లక్ష్యాలకు సమాయత్తం చేస్తూనే ఓటమి పాఠాన్ని వివరించి చెప్పింది. ప్రాజెక్ట్‌ను సమయానికి అందివ్వని కలామే ఓటమి నుంచి ప్రేరణ పొంది మూడే రోజుల్లో పూర్తి చేశాడు. ఆ తర్వాత యుద్ధ విమాన పైలట్ కావాలని కాక్షించిన కలాం పరీక్ష రాయగా 8 పోస్టులకు ఒక్కస్థానం వెనుకబడి తన పెద్ద కల చెదిరిపోయింది. తన తొలి గొప్ప కలను ఆ తర్వాత రాష్ట్రపతిగా ఉన్నపుడు ఏకంగా



సుఖోయ్‌లో ప్రయాణించి నెరవేర్చుకున్నాడు. జలాంతర్గామిలో తిరిగాడు. క్లిష్టమైన సియాచిన్‌లోను పర్యటించాడు. అందుకే 'ఫెయిల్' అంటే 'ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్' (ఓటమే నేర్చుకోవడానికి తొలి ప్రయత్నం) అని, 'ఎండ్'ను 'ఎఫర్ట్ నెవర్ డైస్' (ప్రయత్నానికి మరణం లేదు) అని, 'నో'ను 'నెక్స్ట్ ఆపర్చునిటీ' (తదుపరి అవకాశం) అని కొత్త అబ్రివేషన్లు ఇవ్వగలిగాడు.

మిస్సైల్ మ్యాన్‌గా..

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌లో చేరి తర్వాత 1960లో డీఆర్‌డీవోలో అడుగుపెట్టిన కలాంకు మళ్లీ నిద్రపట్టనివ్వని కలలు గనే అవకాశం కలిగింది. తన ముద్ర వేస్తూ సాగిన ఆయన ఆవిష్కరణలు 69లో ఇస్రో వ్యోమనౌక ప్రాజెక్ట్‌లో భాగస్వామిని చేశాయి. ఆధునిక భారత శాస్త్రరంగ త్రిమూర్తులు విక్రం సారాభాయ్, సతీష్ ధావన్, బ్రహ్మ ప్రకాశ్‌ల సారథ్యంలో పనిచేయడం కాదు పనిని నేర్చుకున్నాడు. తుంబలోని రాళ్ల రప్పలతో నిండిన ప్రాంతంలో ఓ చర్చి భవనంలో మొదలైన అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో పక్షి పాఠాన్ని ఉపయోగించాడు. ఏళ్ల కష్టంతో లాంచింగ్ వెహికల్‌కు ఎక్కించిన ఎస్ఎల్వీ–3 1979లో విఫలమైంది. సదుపాయాలు, నిధులు,

విద్యార్థి లోకపు రాక్‌స్టార్

కలాం రచనల భాగాల్ని పాఠ్య అనుబంధాలుగా చదువుకున్న విద్యార్థులు ఆయనకు అభిమానులుగా మారిపోయారు. రాష్ట్రపతిగా పర్యటనలపుడు, ఆ తర్వాత గౌరవ ప్రసంగాలపుడు ఎక్కడకు వెళ్లినా చిన్నారులే ఘన స్వాగతం పలికేవారు. ఆయన ఉన్న చోటు విద్యార్థి సముద్రంలా కనిపించేది. వారితో కలిసిపోతూ పిట్టకథలు, హాస్యోక్తులు జోడించి సాగిపోయే ఆ కబుర్లలో విద్యార్థులు తేలిపోయేవారు. వేదికపై క్రికెట్ స్టార్లు ఉన్నా, సినిమా హీరోలు ఉన్నా కలాం పేరు వినబడగానే సభాప్రాంగణం కేరింతలతో దద్దరిల్లిపోయేది. ఈ స్థాయి స్పందన చిన్నారి లోకం నుంచి కలాంకు తప్ప ఎవరికీ లభించలేదు. ఆయన చిన్నారులకు హీరో తాతయ్య. పాఠశాల పెయింటింగ్, వక్తృత్వ పోటీలైనా, కళాశాల సెమినార్లయినా అబ్దుల్ కలాం కనిపిస్తాడు, వినిపిస్తాడు. 2003, 2005లో ఎంటీవీ పోల్‌లో యూత్ ఐకాన్‌గా యువభారత్ ఎన్నుకోబడిన రాక్‌స్టార్ అతడు. ఇప్పటికీ ఏ స్ఫూర్తి ప్రదాతల ఒపీనియన్ పోల్‌లోనైనా అబ్దుల్ కలాం పేరు ఉంటే విద్యార్థుల ఓటు ఆయనకే. విద్యార్థి లోకానికి మార్గదర్శనం చేసే ఈ ధ్రువతార పుట్టిన రోజు మీదుగానే జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించుకోవాలని జాతి కోరుతోంది. ఆయన 79వ పుట్టిన రోజును ఐక్యరాజ్యసమితి ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించింది. తాము అమితంగా ప్రేమించే గురువు పేరిట విద్యార్థి దినోత్సవాన్ని నిర్వహించుకోవడం కంటే గొప్ప బహుమతి ఏముంటుంది.

"కింద పడ్డామని ప్రయత్నం అపితే చేసే పనిలో ఎన్నటికీ విజయం సాధించలేము"



సిబ్బంది ఇలా అన్నింటా ఎదురీతే. వీటన్నంటినీ కాచుకుంటూ భగీరథ ప్రయత్నమే చేసినా వైఫల్యం కడగళ్ల వర్షాన్ని కురిపించింది. ప్రాజెక్టును చుట్టేసి కొన్నాళ్లు పాత ఉద్యోగంలో తలదాచుకోవాలని అనుకోలేదు. భారీ వర్షాన్ని తప్పించుకునేందుకు గద్ద మిగతా పక్షుల్లా గూళ్లలో తలదాచుకోదు. ఆ వర్షాన్ని కురిపిస్తున్న మేఘాల్ని దాటుకుని ఆకాశమే లక్ష్యంగా విహరిస్తుంది. ఏడాది గడిచేలోగా మరోసారి ప్రయత్నించి విజయవంతంగా రోహిణిని కక్ష్యలోకి పంపారు. మొన్నటి మార్స్ ఆర్బిటర్ మిషన్ విజయంతో ఇది సరిసమానం. భారత గగనతల విజయాలకు స్ఫూర్తి మంత్రం. భారత్ కలలో కూడా కనని ఇంటిగ్రేటెడ్ బాలిస్టిక్ మిస్సైల్ వ్యవస్థ అనే మరో గొప్ప కలను కలాం కన్నాడు. దాన్ని విజయవంతం చేసి మిస్సైల్ మ్యాన్ అని పిలిపించుకున్నాడు. పోఖ్రాన్-1ను దగ్గరుండి చూసిన ఆయనే పోఖ్రాన్-2కు నేతృత్వం వహించి అణుబాంబ్ ధైర్యాన్ని దేశానికి అందించాడు. ఆంక్షలతో లొంగదీసుకోవాలనుకున్న అమెరికానే 2009లో ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో అత్యున్నత హూవర్ మెడల్‌తో కలాంను సత్కరించింది. ఒకరిని ఓడించడం తేలికే. కానీ ఒకరి మనసును గెలుచుకోవడం కష్టమనే కలాం దాన్ని తేలిగ్గానే చేసేశాడు. స్విట్జర్లాండ్ ప్రభుత్వం తమ దేశంలో కలాం అడుగుపెట్టిన రోజు మే 26నే ఆ దేశ సైన్సు డేగా ప్రకటించింది.

సూపర్ బాస్ కాదు

ప్రాజెక్టులకు సారథిగా ఉన్న కాలంలో కలాం తోటి ఉద్యోగులతో ఆత్మీయంగా ఉంటూ ఓ కుటుంబ సభ్యుడిలా మెలిగాడు. తన దగ్గర పనిచేసేవారు బాధ్యతల్లో మునిగిపోతే వ్యక్తిగత జీవితాలను కోల్పోకుండా చూశాడు. అంతటి బిజీలోను రుద్రవీణను, సంతూర్‌ను సాధన చేస్తూ సంగీతంలో ఓలలాడుతూ జీవితాన్ని ఆస్వాదించాలని చెప్పాడు. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి శ్రీరాగం ఆలాపన వింటూ రోజు ప్రారంభించేవారు. ప్రాజెక్ట్ అసిస్టెంట్ పిల్లలను ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్లడం, తోటి సైంటిస్ట్ బిడ్డను జాగ్రత్తగా విదేశాల నుంచి వస్తూ ఇంటికి చేర్చడం, కుటుంబ సభ్యుల బాగోగులను ఆరా తీయడం వంటి నిజమైన నేతల లక్షణాలను ప్రదర్శిస్తూ లీడర్ అంటే సూపర్ బాస్ కాదని చెప్పాడు. సుదీర్ఘ వృత్తి జీవితంలో కేవలం తల్లిదండ్రుల మరణ సందర్భంలోనే రెండు సెలవులు తీసుకున్నాడు.కలాం

జీవిత పాఠాలు

తాను నేర్చుకున్న జీవిత పాఠాలు క్లాస్‌రూముల్లోనే ప్రతిధ్వనించకుండా దేశ యువత అంతటికీ అందించాలని పుస్తక రచన చేశాడు. తన రచనలు అత్యంత సరళం. నవ సాహితీకారులకు గ్రామర్‌ను అందించాయవి. సాహితీ పిపాసుల సరిపడా కవిత్వాన్నీ చిలికాడు. తన ఇంటి చెట్టు కథ, తమ ఊరి పుట్ట కథ కవిత్వమయ్యాయి. వింగ్స్ ఆఫ్ ఫైర్ అంటూ తన ఆత్మకథ, ఇగ్నైటెడ్ మైండ్స్ అంటూ విద్యార్థుల కథలతోపాటు ఇండియా మై డ్రీమ్, టర్నింగ్ పాయింట్స్, మై జర్నీ, ఎంపవర్డ్ నేషన్, ఇండియా 2020, టార్గెట్ త్రీ బిలియన్, లూమినియస్ స్పార్క్స్, ఇన్‌స్పైరింగ్ థాట్స్, యూ ఆర్ బార్న్ టూ బ్లాసమ్, యూ ఆర్ యూనిక్ అంటూ వ్యక్తిత్వ వికాస, ప్రేరణ సాహిత్యాన్ని అందించాడు. అన్ని సమ స్యలకు మూలం పేదరికం అని తన వేదన పంచుకున్న ఆనంద్ ప్రాంత విద్యార్థిని స్నేహల్ థక్కర్‌కు 'ఇగ్నైటెడ్ మైండ్స్'ను అంకితమిచ్చాడు.



వృత్తి జీవితానికి రిటైర్‌మెంట్ వయసు వచ్చింది. అన్నేళ్ల జీవితంలో ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నాడు. వాటన్నింటినీ క్రోడీకరించి కొత్త తరాలకు చెప్పేందుకు గురువుగా మారాడు. పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు వేదిక ఏదైనా సైన్సుకు, లైఫ్ ఎసెన్స్‌ను మిళితం చేసి విద్యార్థి లోకానికి కొత్త బోధనల్ని పరిచయం చేశాడు. ఆయన ప్రతి క్లాస్ ఓ శాస్త్రవేత్తనో, నేతనో తయారు చేసింది. విద్యార్థి హృదయాల లోతుల్లోకి చేరిన ప్రతి పాఠం ఓ విలువనో, లక్ష్యాన్నో లిఖించి వేసింది. స్వార్థం, లోభత్వం నుంచి విద్యార్థులను దూరం చేస్తేనే అవినీతి లేని సమాజం సాధ్యమని, తల్లిదండ్రులు, గురువుల పాత్రే ఇందులో ప్రధానమని ముగ్గురి స్థానాన్ని వివరించాడు.

విజ్ఞాన భారత నిర్మాణంలో..

మూఢ నమ్మకాలు, అజ్ఞానంతో చిన్నారుల మెదళ్లు కల్తీ కాకుండా సైన్సును పిట్ట కథల్లా బోధించేవాడు. నలుపు అశుభానికి సంకేతమనే మూఢత్వం నుంచి బయటపడేసేందుకు 'చూడటానికి బ్లాక్ బోర్డ్ నల్లగానే ఉండొచ్చు కానీ విద్యార్థుల జీవితాలు ప్రకాశించడానికి అదే కారణమ'ని చెప్పాడు. వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ గొప్ప మెదళ్లు చాలావరకు వెనుక బెంచీల్లోనే తయారవుతాయని స్ఫూర్తి నింపాడు. శాఖాహారిగా ఎందుకు మారారంటే కాలేజీ రోజుల్లో డబ్బులు సరిపోక అని, పెళ్లెందుకు చేసుకోలేదంటే స్వార్థపరుడుని అయిపోతానేమోనని అంటూ చిన్నారుల ప్రశ్నలకు సరదాగా జవాబిస్తూనే సీరియస్‌గా నవజాతి నిర్మాణానికి పథకం వేశాడు. చిన్నారుల గొప్ప కలలకు గౌరవాన్ని ఇస్తూ, వారి ఆలోచన పరిధులను విస్తరిస్తూ విజ్ఞాన భారతావనికి విద్యార్థి సైన్యాని తయారుచేశాడు. జాతి నిర్మాణంలో వారిదే కీలక పాత్ర అని తేల్చిచెబుతూ వారి అడుగులను అటుగా మళ్లించాడు. చిన్నారులతో మాట్లాడితే చాలా విషయాలు తెలుసుకోవచ్చని, వారిలా గొప్ప కలలు కనడం నేర్చుకోవచ్చని అంటాడు. అందుకే వీలున్నప్పుడల్లా చిన్నారులతో కలిసిపోయేవాడు. వారితో సుదీర్ఘ చర్చలు జరిపేవాడు. వారి ఆలోచనలు వివరిస్తూ జరిపే మంతనాల్లో పరవశించిపోయేవాడు. ఇక్కడే కలాం ముందు చూపు కనబడుతుంది. చిన్నారులతో చేసిన ఆ చర్చలు, తరగతులు వృథా పోవు. విద్యార్థుల కోసం చేసిన ఆ రచనలు, ప్రసంగాలు వట్టిబోవు. అవి నవజాతికి ప్రేరణ అవుతాయి. వారి హృదయాల్ని లక్ష్యాలతో ప్రజ్వలింపజేస్తాయి. సైన్సు పాఠాల్ని, నాయకత్వ లక్షణాలను నరనరాన జాతికి ఎక్కిస్తాయి. వనరుల పరంగా ఆఫ్రికా కన్నా చాలా సూక్ష్మమైన జపాన్ ఎందుకు అభివృద్ధిలో తారాపథాన ఉందనేది ఆయన ప్రశ్న. శాస్త్ర, సాంకేతిక విప్లవమే జాతిని పేదరికం, వెనుకబాటుతనం నుంచి దూరం చేస్తుందనే సమాధానం తాను ఇచ్చాడు. ఆ కలల్నే విద్యార్థులకు పంచాడు. జాతిని సమాయత్తం చేశాడు. విజన్ 2020 ప్రణాళికను ఆవిష్కరించాడు. సైన్సు విషయాలకు తగిన చోటు ఎందుకు కల్పించడం లేదంటూ మీడియాను ప్రశ్నించాడు. బిలియన్ బీట్స్ పేరిట ఈ పేపర్‌ను నడిపాడు. ఇప్పుడు శాస్త్రీయ అన్వయంలో జాతి పరుగులు తీస్తుందంటే, టెక్నాలజీ ప్రతి ఇంటిని తడుతుందంటే ప్రేరణ కలామే. 1990-2000 కాలంలో ఆయన రచనలు, 2000 నుంచి ఇప్పటి వరకు ఆయన ప్రసంగాలు, పర్యటనలు సాంకేతికతను ప్రతి భారతీయుని గుప్పిట పట్టేందుకు దేశాన్ని దౌడు తీయించాయి. సాంకేతికతను అన్వయించుకుంటూ ఫేస్‌బుక్,

కాలేజీ రోజుల్లో.....

నిండైన గౌరవం

ఐఐటీ వారణాసి స్నాతకోత్సవానికి గౌరవ అధ్యక్షునిగా హాజరైన కలాం అక్కడ ఏర్పాట్లలో తనకు ప్రత్యేక కుర్చీ వేయడాన్ని గమనించారు. వేదిక ఎక్కుతూనే సాధారణ కుర్చీ వేయాలని కోరారు. తానే పక్కనున్న కుర్చీని లాక్కొని కూర్చున్నారు. కలాం ప్రత్యేక మర్యాదలకు దూరమని ఈ విషయం రూఢి చేస్తుంది. ఈ నిండైన వ్యక్తిత్వం దేశానికి ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని మరింత పెంచింది. కింగ్ చార్లెస్-2 అవార్డు, ప్రఖ్యాత రాయల్ సొసైటీ యూకే అవార్డును, అంతర్జాతీయ వాన్ కర్మన్ వింగ్స్ అవార్డుతో పాటు ఎన్నో అంతర్జాతీయ సత్కారాలు ఆయనకు అందాయి. ఆయన సేవలు విస్తృతమవుతున్న కొద్దీ జాతి కూడా పద్మభూషణ్, పద్మవిభూషణ్, భారతరత్నలతో ఆయన్ను గౌరవించుకుంది. రామానుజన్, వీర్ సావార్కర్ అవార్డు కూడా పొందారు. ప్రపంచవ్యాప్తంగా ఓక్‌ల్యాండ్, ఎడినోబరోతో సహా 40 విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లను అందించాయి.

ట్విట్టర్ వంటి సామాజిక మీడియాను తన ప్రచారానికి వేదిక చేసుకున్నాడు. స్వామి వివేకానంద తర్వాత కలామ్ క్వోట్స్‌నే యువత ఎక్కువగా ఫాలో అవుతోందని లెక్కలు. గూగుల్ సెర్చ్‌లో అబ్దుల్ కలాం పేరుని టైప్ చేస్తే ఆయన రచనలు, క్వోట్స్, ఉపన్యాసాలకు సంబంధించిన వర్డ్ చాయిస్‌లే కనిపిస్తాయి. సాంకేతికత వైపు విద్యార్థి భారత్ పరుగు కోసం 2002లో రాష్ట్రపతి అవకాశాన్ని ఒడిసిపట్టాడు. ఎప్పుడో పరిచయమున్న టీ కొట్టు యజమానిని, చెప్పులు కుట్టే మిత్రున్ని తన ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించి తన వ్యక్తిత్వాన్ని చాటాడు. తాను పుట్టి పెరిగిన రామేశ్వరానికి ఆ అనుభూతులను పంచాడు. అక్కడ ఆయన ప్రతి ఇంటి బంధువు. దేశంలోని ప్రతి కుటుంబానికి చిరునవ్వుల శ్రేయోభిలాషే. భారత దేశానికి రాష్ట్రపతి అయిన తొలి శాస్త్రవేత్త కలామే. భారత సైన్స్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన తొలి రాష్ట్రపతి కలామే.

సిసలైన సర్వసైన్యాధ్యక్షుడు

రాష్ట్రపతి అంటే దేశ ప్రథమ పౌరుడు. అలాగే సర్వసైన్యాధ్యక్షుడు. దేశ భద్రతలో విశ్రమించని సైన్యానికి కలాం అధినేత కాక మునుపే శాస్త్ర సాంకేతిక రంగాల్లో సైనికుడిలా పనిచేశాడు. సైన్యానికి అత్యంత ఉత్కృష్టమైన ఆయుధాల్ని సమకూర్చి నిజమైన అధ్యక్షుడిగా జేజేలు అందుకున్నాడు. నాలుగు దశాబ్దాల క్రితం యుద్ధ మేఘాలు అభివృద్ధిని నీరుగారుస్తున్నాయి. వీరోచితంగా పోరాడి ప్రాణాల్ని త్యాగం చేస్తున్న సైనికుల వేల మరణాల్ని ఆపడం ఎలానో తెలియడం లేదు. అప్పుడే కలాం శాస్త్ర సాంకేతిక రంగంలో మార్పులు తెస్తున్నాడు. ఎవరూ ఊహించని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్స్ వ్యవస్థ ఆలోచన చేశాడు. ఇది భారత్‌కు సాధ్యమా అని పరిహసించిన దేశాలు గుండెలు గడగడలాడేలా ప్రాజెక్ట్ డెవిల్, ప్రాజెక్ట్ వేలియెంట్‌లను విజయవంతం చేశాడు. ఏకంగా ఖండాంతర క్షిపణి శ్రేణినే ప్రవేశపెట్టి ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచాడు.

కాగితాల్లోనే రెపరెపలాడిన ఆ ప్రాజెక్ట్‌కు నాటి ప్రధాని ఇందిరా గాంధీని పట్టుబట్టి ఒప్పించాడు. క్యాబినెట్ తిరస్కరించినా ఆమె ప్రధాని విచక్షణ నిధుల నుంచి పెద్ద మొత్తంలో ప్రాజెక్ట్‌కు నిధుల్ని రాబట్టాడు. పృథ్వీ, అగ్ని, త్రిశూల్, ఆకాశ్ ఇలా ఒక్కో శైలి క్షిపణి ఒక్కో శ్రేణి దాటుకుంటూ కలాంను మిస్సైల్ మ్యాన్‌ను చేసింది ఆ ప్రాజెక్ట్. శత్రు దేశాల అణు బాంబు బూచి భయపెడుతున్న తరుణంలో ప్రోఖ్రాన్-2కు సారథ్యం వహించి విజయవంతం చేశాడు. ఇలా భద్రమైన జాతికి మార్గనిర్దేశకుడయ్యాడు.

ఆయుధాలను రూపొందించినంత మాత్రాన కలాం హింసావాది కాదు. డీఆర్డీవోలో పనిచేసే కాలంలో ఓ రక్షణ గోడ భద్రత పెంచేందుకు గాజు పెంకులతో ఫెన్సింగ్ వేయించాలని సిబ్బంది సూచిస్తే దానిపై వాలే పక్షులకు గాయాలవుతాయని తిరస్కరించారు. హృద్రోగుల చికిత్సకు కీలకమైన కరోనరీ స్టెంట్లను తక్కువ ధరకే అందేలా కేర్ రాజుతో కలిసి రూపకల్పన చేశారు. బరువైన ప్రోస్తెటిక్ లెగ్‌లతో బాధపడుతున్న వికలాంగుల అవస్థలు తీర్చేందుకు ఫ్లోర్ రియాక్షన్ ఆర్థోసిస్ కృత్రిమ కాలి పరికరాలను తయారుచేశారు. అంతరిక్షం సౌరవిద్యుత్ ప్రాజెక్ట్, నదుల అనుసంధానం, నేషనల్ ప్రాస్పెరిటీ ఇండెక్స్, పురా గ్రామీణాభివృద్ధి కార్యక్రమం ఇలా ఎన్నో విభిన్న రంగాల అభివృద్ధికి గొప్ప కలల్ని భారత్‌కు



అందించారు. లీడ్ ఇండియా కార్యక్రమం ద్వారా భారత్‌ను ముందుండి నడిపించారు. రాష్ట్రపతి పదవీ విరమణ తర్వాత దేశవ్యాప్తంగా విద్యాలయాల్లో పర్యటిస్తూ తనకెంతో ఇష్టమైన గురు వృత్తిని చేపట్టారు. షిల్లాంగ్, ఇండోర్, అహ్మదాబాద్ ఐఐఎంలు, బెంగళూరు ఐఐఎస్, స్పేస్ ఇనిస్టిట్యూట్‌లు, ఐఐటీ హైదరాబాద్, అన్నా, ఐఎస్ఎస్, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో పాఠాలు బోధించారు. కలాం ఎంత స్థాయికి చేరినప్పటికీ రెండే గదుల్లోనే ఉండేవాడు. ఒకటి నివాసానికి, రెండోది పుస్తకాలకు. రాష్ట్రపతి భవన్‌లో ప్రవేశించేపుడు, వీడ్కోలు చెప్పినపుడు రెండే సూట్‌కేసుల లగేజీతోనే ఉన్నారు. కలాం ప్రతి నినాదం, ప్రతి కోట్, ప్రతి ప్రసంగం,

ప్రతి పాఠం, ప్రతి రచన కోరే ఉదాత్తమైన వ్యక్తిత్వం, అచంచల కార్యదీక్ష, అమేయమైన శక్తి, అసమాన నిబద్ధత వంటి లక్షణాలన్నీ ఆయన ఆచరించి చూపారు. ఆయనకు సాధ్యమైన వాటినే ఇతరుల నుంచి కోరారు. తనకు న్యూక్లియర్ ఫిజిక్స్ పాఠాలు బోధించిన తన గురువు చిన్నాదురై మాస్టారును దిండుగల్‌లో కొద్దిరోజుల క్రితమే కలాం కలిసి గౌరవించారు. కలాం అంతిమ యాత్రకు వీల్‌చైర్లో వచ్చిన వైమానిక దళ మార్షల్ అర్జన్ సింగ్ తన శక్తినంతటినీ కూడదీసుకుని లేచి నిలబడి వందన సమర్పణ చేశారంటే ఆయన ప్రభావం ఎంత బలీయమైందో తెలుస్తుంది. చివరి క్షణం వరకు మేధో భారత్ జాతి నిర్మాణానికే అంకితమైన కలాం నవ భారత్‌కు గురువు, యువ భారత్‌కు మార్గనిర్దేశకుడు తన పని విధానం, ఉత్తమ ఆచరణ ద్వారానే అయ్యాడు. తన స్ఫూర్తి సాహిత్యాన్ని విడిచి వెళుతూ చిరస్మరణీయుడయ్యాడు. 'ఐ కెన్ డూ ఇట్.యు కెన్ డూ ఇట్. ఇండియా కెన్ డూ ఇట్..' అనే కలాం నినాదమే ప్రేరణగా ఆయన పథంలో నవజాతి నిర్మాణాన్ని యువ భారత్ సంకల్పం తీసుకుంది.

- అజయ్ కుమార్ వారాల

నేనెప్పుడో...

-చందనపల్లి గోపాల్‌రావు

◆ కథ



"...ఛీ అంతే బేపికి తెలుస్తాది. అంతకన్నా అద్దోనం. ముండ్రాల మొగుడు. ఎన్నంతే మాత్రం సిగ్గా... లజ్జా? ఏం పుట్టుక పుట్టాడో...? తల్లి కన్నాది కానుపు... ఎన్ని నోములు నోసి కన్నాదో ఈ కొడుకుని, నా మెడకి సుట్టుకోడానికి. ఇదిగో... ఈ వొ్జాన్ని కన్నాడు ఆ వొ్జిం. ఎల్లమ్మని ఎంచక్కర్లేదు, పోలమ్మని పొంచక్కర్లేదు..."

అప్పలస్వామి కోడలు దండకం మొదలు పెట్టింది. ఊరందరికీ కోడి కూతతో తెల్లారుతుంది. కానీ అప్పలస్వామికి మాత్రం కోడలు దండకంతోనే తెల్లారింది. అప్పలస్వామికి కళ్లమీద నుండి నిద్రమత్తు ఎగిరిపోయింది.

'రాత్రి ఎప్పుడొచ్చాడో... రాత్రి ఎక్కింది ఇంకా దిగిందో లేదో! ఆడ్ని ఏటీ సెయ్యిలేక నా మీద ఇంతెత్తు లేస్తుంది మా కోడలు. "మనిషికొక మాట, గొడ్డుకొక దెబ్బ" అన్నారు కదా! ఏ మాటైనా పట్టించుకుంటే కదా ఆడు... అది మాత్రం ఏటి సెయ్యిగల్దు' అనుకుంటూ కూర్చున్న వాడల్లా లేచి నెమ్మదిగా వీధి గుమ్మం వైపు అడుగులు వేశాడు.

ఇంటి ముందు పశువులసాల, సాలలో పశువులు వాటికి కుడితి పెట్టి గడ్డెయ్యాల. సాలలోని పేడతీసి, తుడిసి శుభ్రం సెయ్యాల. కుడిప్పెయ్యల మెడకట్లు యిప్పి పాలు తియ్యాల. ఏరు పూసుకోని పొలానికెల్లి దున్నుకొని రావాల. యీటన్నిటికి ముం దు సెరువుకాసెల్లి ఏపపుల్ల యిరిసి పలకర్ర సేసు కోని వొచ్చీయాల. నిద్రలో కలగంటునట్టు కలవ రిస్తూ వీధిలోకి వచ్చిన అప్పలస్వామికి ఇవేవీ కనిపించలేదు.

ఈ ఊరు వచ్చిన తరువాత గత రెండు మూడు సంవత్సరాల నుండి ఇదే పరిస్థితి.

పశువులు లేవు, పశువుల శాలలు లేవు, ఏరు పూధ్దం అంతే నాగలి లేదు, ఏరెడ్లూ లేవు. గోవుపా దమంత జాగా లేదు, మొక్కా లేదు, మోడూ లేదు.

ప్రాజెక్టు వచ్చింతదని అందరూ సరదా పడ్డారు, పొలాలకు నీరొచ్చి పంటలు బాగా పండుతాయని కానీ అదే ప్రాజెక్టు ముంపులోకి వచ్చాయి. అప్పలస్వామి ఊరు, పొలాలు. అలాగే మరికొన్ని ఊళ్ళు, భూములు ముంపులో చేరాయి.

"అయ్యో పాపం... ఊళ్ళు పోయి, భూములు మునిగిపోతే వాళ్ళు ఎలా బతుకుతారని" కొందరు సానుభూతి చూపారు.

"వాళ్ళకేం? అదృష్టవంతులు, పరిహారం సొమ్ము బాగా అందుతుంది. దాంతో వాళ్ళ రాతలే మారిపోతాయి." అని మరికొందరు అన్నారు. ఎవరెన్ని రకాలుగా అనుకున్నా అప్పలస్వామి సొంత ఊరును వదలి పట్టణానికి దగ్గరలో కట్టుకున్న కొత్త కాలనీకి వచ్చిన తరువాత తన తలరాత పూర్తిగా మారిపోయింది.

అనారోగ్యంతో భార్య చనిపోయింది.

పరిహారంగా వచ్చిన డబ్బును ఇద్దరు కొడుకులు వాటాలేసుకున్నారు. తన వాటాను తీసుకొని పెద్ద కొడుకు వాళ్ళ అత్తారింటికి చేరాడు. చిన్నకొడుకు చేతిల పడ్డ సొమ్ముతో జెల్సాలు చేసి వ్యసనాలకు బానిసయ్యాడు. నిర్వాసితులకు ఇచ్చిన ఇంటి స్థలంలో భూమికి పరిహారంగా వచ్చిన సొమ్ముతో అతికష్టం మీద ఇల్లు కట్టుకున్నాడు. అప్పలస్వామి చిన్నకొడుకు, కోడలుతో కొత్త కాలనీలో ఉంటున్నాడు.

'తెల్లవారు ఝామున కోడికూతలు... వేకువ చీకటిని చీల్చుకొని వొచ్చి ఊరంతా వెండి వెలుతురులు పంచే లేలేత సూర్యకిరణాలు... నాగావళి నదిలో ఖాళీ కుండలను ముంచి బరువెక్కిన కావుళ్ళను భుజాలపై మోసుకొచ్చే వాళ్ళతో కళకళలాడే నీలాటి రేవులు... సాలల్లో పాడి పశువులు పొదుగుల్లోంచి "సుయ్... సుయ్.." మంటూ కుండల్లోకి జారే పాలధారలు... లేగదూడల గెంతులు... ఇవన్నీ ఏవీ? ఏటైపోయాయి? వాహనాల రాకపోకలతో దుమ్మూ, ధూళీ లేస్తూ ఎప్పుడూ హడావిడిగా, అల్లకల్లోలంగా ఉండే సిమ్మెంటు రోడ్ల క్రింద భూస్థాపితం ఐపోయాయా?కాలకృత్యాలకు ఆరుబయట చెరువుకి వెళ్ళి, వేపపుల్ల పలకర్ర చేసుకొనేవాడికి, ఇంట్లో మరుగుదొడ్డి, బ్రష్‌మీద పేస్టు... ఒక్కొక్కటే అలవాటవుతున్నాయి.

తన నేలకు దూరం, ఊరికి దూరం, వ్యవసాయానికి దూరం, అలవాట్లకు దూరం, తనదైన జీవితానికి దూరం. ఇలా అన్నింటికీ దూరం అవుతూ, దేనికి దగ్గరవుతున్నాడో అప్పలస్వామికి అర్థం కావడం లేదు. అంతా అయోమయంగా ఉంది అతనికి. "రా నాయనా రా! కసింత బుక్కీసి ఎల్దువుగాని. కూకోని తిండానికి నువ్వు సంపాదించి పాతరేసిన లంకెలబిందెలు లేవిక్కడ. కేరేజీ సర్దీసా. పట్టుకొనెల్లు. వొంటిమీద తెలివి లేనోడిలాగ, ఎటో దేల పోయినట్టు ఎప్పుడూ ఏటి ఆలోసిస్తాడో మరి. మారాజు తండ్రి. కొడిక్కి తాగేసి వొంటిమీద సెనతనుండదు. తండ్రికి తాక్కుండానే వొంటి మీద సెతనుండదు. నా కరమ్ము కాకపోతే యీ

సమ్మందం వొద్దని నెత్తీనోరూ మొత్తుకొని సెప్పారట మా సుట్టాలు. ఐనా యినకుండా సేస్సారు మా కన్నోరు. యిప్పుడు నేను అనుబగించుతున్నాను. కట్టు పనికి ఇటిక బెడ్డలు అందించడం, ఇసక లోన సిమెంటు కలపడం..ఎన్నడెరగని పని. "వొప్పుకున్న తరువాత తప్పుతాదా? వొంతు నొచ్చింది గెంతితే తప్పోద్దా?" అంతా నా కరమ్మ" కోడలు ఏదో ఒకటి గొణుగుతూనే వుంది. గుండెల్లో ముల్లు గుచ్చుతున్నట్టు.

అప్పలస్వామికి భార్య లేని లోటు స్పష్టంగా తెలుస్తోంది. ఏ రోజైనా ఒక్క మాటైనా అన్నాదని లేదు. ఏ విషయంలోనూ తన మీద విసుక్కున్నదనీ లేదు. భార్య చనిపోయిన తరువాత మూతిమీద గెంజి పోసిన దిక్కులేక ఎవరెన్ని మాటలు అన్నా పడాల్సి వస్తోంది. గెంజిబువ్వ కేరేజీతో పట్టుకొని పనికి పరిగెట్టాల్సి వస్తోంది. అలవాటు లేని పని. ఒకరి కింద చెయ్యాల్సిన పని. అదే పాత ఊరిలో అయితే వ్యవసాయం.... పొలంలో ఏ పనైనా చిన్నప్పటి నుండి అలవాటైన పని. తాత నుండి తండ్రికి, తండ్రి నుండి తనకి వచ్చిన పని. బెడ్డ దుక్కి దున్నాలన్నా, ఉడుపు మడి దమ్ము పట్టాలన్నా, వరిచేను బండికి ఎక్కించాలన్నా, ధాన్యం గాలికి పట్టాలన్నా, ధాన్యం పురిచుట్టాలన్నా... ఏ పని చెయ్యాలన్నా అప్పలస్వామి తరువాతే ఎవరైనా. అటువంటి అప్పలస్వామి సిమెంటు బస్తా విప్పి, ఇసక కుప్ప మీద పోసి, పారతో కలపడానికి తడబడుతున్నాడు. నీరు పోసి కలిపిన సున్నం గమేనుకెత్తి పరంజి మీదకెక్కి మేస్త్రికి అందించడమంటే, అడవిలోన సింహంలాంటి తను సర్కస్ చేస్తున్నట్టుగా అనిపిస్తుంది.

"చేత కాకపోతే ఎందుకు రావడం. మాకు పని దండగ. ఇంకొకర్ని పిలుసుకుంటాం కదా?" మేస్త్రి చేత మాటలు పడవలసి వస్తోంది. అయినా తప్పదు. ఇంటి దగ్గరుండి కోడల్దాని చేత మాటలు పడేకంటే, పనిలో మాటలు కాయడమే మేలు అనుకుని గబగబా గెంజితాగి సిల్వరు కేరేజి పట్టుకొని బయలుదేరాడు అప్పలస్వామి.

అప్పలస్వామి అప్పుడెప్పుడైనా ఇంటినుండి బయలుదేరినప్పుడు సాలలోని పశువులు తలలూపి పలకరించేవి. చెయ్యి వేసి నిమిరితే నాలుకతో నాకి 'క్షేమంగా వెళ్ళి రా' అనట్టు అటూ ఇటూ తలలు ఆడిం చేవి. కాళ్ళకు అడ్డం పడి గెంతులేస్తూ లేగ దూడలు 'తిరిగి ఎప్పుడు వస్తావు?' అన్నట్టు అల్లరి చేసేవి. వచ్చే కాసులకోసం ఎదురు చూసేవాళ్ళే తప్ప, తన రాక కోసం ఎదురు చూసే మూగజీవాలు లేవిప్పుడు.

ఆకాశమంతా మబ్బులు పట్టి చిన్న చినుకులు మొదలయ్యాయి. తొలకరి వర్షం. ములగసిర కార్తిలో తొలివాన పడీసరికి ఊరిలోన ఎంత సందడి? ఈపాటికి తాలూ తలువు ఏసుకోని, నక్కూ నాగలి సంగరించుకోని, చినుకు పడీసరికి ఏలు పూసుకోని దున్నుకుండోలిమి. ఎప్పుడొచ్చిందో... డాము. అందరూ సరదా పడిపోయారు. వో హెూ హెూ... బ్రమ్మాండంగ వుంది, బూవులకు పరిహారం ఇస్తారు మనకేటి అని సంకలు గుద్దుకున్నారు, ఇప్పుడేటయ్యింది?, అని అనుకుంటూ మొహం మీద పడుతున్న చినుకులకు చెయ్యి అడ్డం పెట్టుకుని గబగబా అడుగులు వేశాడు.

ముందు కొత్త రోడ్డుకి వెళ్ళాలి, అక్కడ తనలాంటి వాళ్ళు కొందరు చేరుతారు. ఆటో ఎక్కి టౌను చివర నాలుగు రోడ్ల సెంటరుకి చేరాలి. మేస్త్రి పనులు సర్ది, ఎవర్ని ఎక్కడికి వెళ్ళమంటాడో తెలీదు. అక్కడ మళ్ళీ ఆటో ఎక్కి పని దగ్గరికి వెళ్ళాలి. ఆలస్యం ఐతే మేస్త్రి తిడతాడు. అనుకొని నడక వేగం పెంచాడు. అప్పటికే చాలామంది



కేరేజీలు పట్టుకుని కొత్త కాలనీ మలుపు దాటి మట్టి రోడ్డులో నడుస్తున్నారు.

అల్లుడు వరస అయిన సింహాచలం అటునుండి వస్తూ... "ఏట్రా మావా?" అని పలకరించాడు.

"ఏటంతా వేట్రా.. ముష్టి బతుకైపోయింది. సూత్తన్నావు కదా కేరేజీ, రోజరూ పనికెల్తేనే కడుపుకింత గెంజి దొరుకుతాది లేకపోతే లేదు. కూలి బతుకైపోయింది రా, కూలి బతుకు"

"ఏట్రా! కట్టలు కట్టలు పరిహారం వచ్చింది గావాలా? మీకేట్రా లోటు?"

"మీరలగే ఇకటాలాడతార్రా. పట్టినోడు పరిగంతే, ఒడ్డు మీదున్నోడు మిట్ట అన్నట్టుగుంది. మీ ఊరూ, బూవులూ డాములో పడితే అప్పుడు తెలుస్తాది లోటేటో?" అని అనుకుంటూ, చినుకులకు తడుస్తూ సింహాచలాన్ని దాటి నడుస్తున్నాడు.

'బయటెక్కడో ఉజ్జోగాలు చేసుకున్నోలికి, దూరంగా ఉన్నోలికి మా బతుకులు గురించి ఏటి తెలుస్తాది? డబ్బొచ్చింది ఆలకేటి? పెద్ద పెద్ద మేడలు కట్టుకుంతండ్రు అని అనుకుంటున్నారు. పాత ఊర్లో ఉన్న నాలుగైదు ఎకరాలు వ్యవసాయం సేసుకొని, తిండికి లోబం లేకుండా ఉండోలిమి. ఊర్లోన అందరూ మాట ఇనోలు, గౌరవమిచ్చోలు. కొడుకులు, కోడళ్ళు అంతా కలిసి ఉండోలిమి. డాము వచ్చింది, ఊరు పోయింది, బూవులు పోయాయి. డబ్బు సేతిల పడీసరికి మతులు సెడిపోయి నా వాటా అంతే నా వాటా అని కొడుకులు, కోడళ్ళు ఏరుపాట్లు అయ్యారు. కన్నోరికి బూముంది. ఆలకి సేసినోలు లేరు అని మొగుడ్ని తీసుకొని పెద్దకోడలు ఎల్లిపోయింది. ఇక్కడ వొచ్చిన ఇంటి జాగా ఉంటే ఎప్పుడైనా మనసు మారి ఎలిపోదుం అంతాడేటో అని అదీ అమ్మించీసింది.

ఇక్కడికి వొచ్చిన తరువాత పనీపాటు లేక చేతిల ఉన్న డబ్బు కర్సు పెట్టుకొని వ్యసనపరుడు

ఐపోయాడు చిన్న కొడుకు. ఇచ్చిన జాగాలోన ఇంతింత రేట్లుతోని ఇల్లు కట్టేసరికి ఉన్నదంతా అయిపోయింది. తిండిక్కూడ కష్టంగుంది. ఇదంతా ఎవలికి తెలుస్తాది? డాము వొచ్చిన తరువాత వొకరిద్దరు బాగా సంపాదించారని, కార్లు, బళ్ళు మీద తిరుగుతున్నారని అందరూ అలాగే ఉన్నారనుకుం టున్నారు. పేదోల, రైతుల పొట్టలు కొట్టి, పేకేజీల్లో వాటాలు తీసుకుని డబ్బు సంపాదించినోళ్ళను సూసి అందరూ అలాగే ఉన్నారనుకొంటున్నారు.

ఆలోచిస్తూ సెంటరుకి వెళ్ళేసరికి తనకంటే ముందొచ్చిన వాళ్ళందరూ అప్పటికే ఆటో ఎక్కివెళ్ళిపోయారు. తన కోసం ఆగేవాళ్ళే లేరు. మరొక ఆటో ఎప్పుడొస్తుందో? ఆలిసిం అయిపోయింది. నాలుగు రోడ్ల సెంటరుకి ఎల్లేసరికి మేస్త్రి పని సర్దేస్తాడేటో? సె... ఎప్పుడూ యిలగ జరగలేదు. గబీన ఎల్లిపోవాలి. అని అనుకుంటూ అటూ ఇటూ చూశాడు. ఆటో రాలేదేటా అని విసుక్కున్నాడు.

చినుకులు పడుతూనే ఉన్నాయి. వొళ్ళంతా తడిసి బట్టలు నానిపోతున్నాయి. ఇంతకు ముందు చినుకులు పడితే అందులో తడుస్తూ పని చేస్తే ఆనందంగా ఉండేది. చినుకు పడి తడిసిన భూమి పొరల్లోంచి వచ్చిన 'మట్టి వాసన'కు ప్రాణం లేచొచ్చినట్టు గుండేది. ఊరందరికి వ్యవసాయపు పనులు ప్రారంభం అయ్యాయి. హడావిడిగా ఉండీది. కానీ యిప్పుడు అప్పలస్వామికి చినుకులు పడుతుంటే చిరాకు కలుగుతోంది. ఇవి ఇలాగే పడితే మేస్త్రి ఎక్కడ సిమ్మెంటు పని ఆపేస్తాడో అని భయమేసింది. పాత ఊరులో గాది నిండా తిండి గింజలు ఉండే సరికి ఎంత ధైర్యంగా వుండేది. ఇప్పుడు గాదీ లేదు. గింజలూ లేవు. ఏటి సెయ్యాలో ఎందల పడిపోవాలో తెలీదు.

ఆలోచిస్తూనే రోడ్డువైపు చూశాడు. దూరంగా వస్తున్న ఆటోలో ఎలాగైనా ఎక్కి వెళ్ళాలనుకున్నాడు. ఆటోను ఆపాడు. ఆటోలో ఎక్కి కూర్చున్నాడే గాని పనికి అందుతాడో లేదో అని ఆందోళన పడ్డాడు. ఆఖరుకి సెంటరుకి చేరాడు. అప్పటికే మేస్త్రి పనులు సర్దీ సి వెళ్ళిపోయాడు. ఉన్న ఒకరిద్దరు పనోల్ని బతిమలాడి వాళ్ళతో పనికి తీసుకెళ్ళమన్నాడు. వాళ్ళు "నీతోనై తే ఈ రోజు పని అయినట్టే" అంటూ వెళ్ళిపోయారు. అప్పలస్వామికి ఏమి చేయాలో తెలియడం లేదు.

కానో పరకో కూలి డబ్బులు తీసుకురాకపోతే కోడలు ఇంటికి రానివ్వదు. ఏటి సెయ్యడం? తిరిగి ఇంటికి వెళ్ళిపోవడమా? దగ్గరలో ఉన్నా ఏ ఇంటికైనా ఎల్లి ఏదో ఒక పని చేస్తాను దయకలిగినంత ఇమ్మని అడగడమా? ఏ పనీ లేకపోతే ఇంటి చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలైనా పీకుతానని సెప్పి బతిమాలడమా?

ఆహా... ఏమి గాచ్చారం వొచ్చిందిరా బగమంతుడా? అక్కడున్నప్పుడు ఎంతమందికి పనిచ్చోడ్ని. ఉడుపులకీ, గాబుతీతలకీ, పారపనికీ, జనువులు తీతకీ... ఎంతమందికి కూలి డబ్బులు పంచోడ్ని. ఇప్పుడు ఆ కూలి డబ్బులికే ఎవరి దగ్గరికెల్లి ప్రాదేయపడాలో? ఛ... యింత బతుకూ బతికి ఇలాకత్తుల చచ్చినట్టుగుంది నా పరిస్థితి. బూవులు పోయినా లచ్చలచ్చలు సేతిలబడ్డాయి మరింక తిరుగులేదు బతుక్కి అదని ఆశపడినందుకు ఇదిగిలగ దిక్కుమాలి కూలిముచ్చులమైపోనాము... కరమ్ము నాయినా కరమ్ము...' అని తనలో తాను గొణుక్కుంటూ రోడ్డుకి అవతలి వైపుకి, ఇవతలి వైపుకి మతి లేనోడిలాగ తిరుగుతున్నారు.

ఇంతలో ఒక్కసారిగా సడన్ బ్రేక్‌పడ్డ శబ్దం. అప్పలస్వామి చేతిలోని కేరేజీ అల్లంత దూరంలో ఎగిరి పడింది. రోడ్డు మీద అప్పలస్వామి వెల్లకిలా పడ్డాడు "ఏమయ్యా! నీకు బతకాలని లేదా? చావడానికి నాకారే దొరికిందా. అసలు పోయావనే అనుకున్నాను..." ఇంకా ఏదేదో కేకలు వేస్తున్నాడు కారులో నుండి దిగిన వ్యక్తి.

చుట్టూ జనం. అప్పలస్వామికి అంతా అయోమయంగా ఉంది. ఎవరేమంటున్నారో తెలియడం లేదు. ఒక్క కారు యజమాని మాటే చెవిలో గింగురుమంటోంది.

"నేను పోయానా? ఇప్పుడు పోవడమేటి? నిజానికి నేనెప్పుడో చనిపోయాను కదా? సెవానికి సావేటి?" అప్పలస్వామి ఏమి మాట్లాడుతున్నాడో జనానికి అర్థం కావడం లేదు. దెబ్బతగిలిన షాక్‌లోనే ఉన్నాడనుకొని ప్రమాదం ఏమీ లేకపోవడంతో ఎటోలటు చెదిరిపోయారు. అప్పలస్వామి మళ్ళీ మనసులో అనుకుంటున్నట్టు బయటికే అన్నాడు. "నేనెప్పుడో..." ✦

◆ ఔనా...

ప్రపంచంలోని నదీజలాల్లో మనం వుపయోగించుకుంటోంది 12 శాతం మాత్రమే.

ఆవు తన జీవిత కాలంలో 200,000 గ్లాసుల పాలు ఇస్తుంది.

గొరిల్లాలు రోజుకి 14 గంటలపాటు గుర్రు పెట్టి నిద్రపోతాయి.

మనం కళ్లు తెరుచుకుని పగటి కలలు కంటుంటాం. డాల్ఫిన్లు కళ్లు తెరుచుకునే నిద్రపోతాయి.

కోడిపెట్ట ఏడాదికి సగటున 19 డజన్ల గుడ్లు పెడుతుంది.

గబ్బిలాలు ఎటువంటి ఆహారాన్నైనా తినగలవు. ఇదే రకం ఆహారం కావాలన్న పట్టింపులేం లేవు వాటికి.

ఏనుగులు మూడు మైళ్ల దూరం నుంచే నీటి జాడను కనిపెట్టగలవు.



ఎథక్కాప్పం

కావలసిన పదార్థాలు

బాగా పండిన అరటిపండ్లు -రెండు, మైదా-అర కప్పు, బియ్యప్పిండి-టేబుల్ స్పూను, చక్కెర- రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు-కొద్దిగా, నీళ్ల - కప్పు, నూనె-వేయించడానికి సరిపడా.

తయారీ

ఓ గిన్నెలో అరటిపండ్లు, నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ తీసుకుని ఇడ్లీ పిండి కంటే కాస్త గట్టిగా కలిపి పెట్టుకోవాలి. ఇప్పుడు అరటిపండ్లను నచ్చినట్టుగా స్లైసుల్లా కోయాలి. ఈ ముక్కల్ని ముందుగా చేసుకున్న పిండిలో ముంచి కాగుతున్న నూనెలో వేయాలి. బాగా వేగాక తీసేస్తే సరిపోతుంది. ఇవి వేడిగా తింటేనే బాగుంటాయి.

ఇడియాప్పం

కావలసిన పదార్థాలు

వేయించిన బియ్యప్పిండి- ఒకటిన్నర కప్పు, వేడి నీళ్ళు-ఒకటిన్నర కప్పు, కొబ్బరి తురుము-ముప్పావు కప్పు, ఉప్పు-తగినంత

తయారీ

ఓ గిన్నెలో బియ్యప్పిండి తీసుకుని ఉప్పు వేసి బాగా కలపాలి. తరువాత వేడి నీళ్ళు పోసుకుంటూ పిండిలా కలపాలి. అవసరాన్ని బట్టి నీళ్ళు పోసుకుంటూ గట్టి పిండి అయ్యేదాకా కలుపుతూ ఉండాలి. ఇప్పుడు దీనిపైన తడిబట్టని కప్పి కాసేపు నాననివ్వాలి.అరగంట అయ్యాక ఇడ్లీ ప్లేట్లను తీసుకుని నూనె లేదా నెయ్యి రాసి అందులో కొద్దిగా కొబ్బరి తురుము వేయాలి. ముందుగా కలిపి పెట్టుకున్న పిండిని జంతికల గొట్టంలోకి తీసుకుని ఇడ్లీ ప్లేట్లలో జంతికలు వచ్చేలా వత్తాలి. ఇప్పుడు వీటిని ఆవిరి మీద ఏడు నుంచి తొమ్మిది నిమిషాల వరకూ ఉడికించి దింపేయాలి. వేడి కొద్దిగా చల్లారాక చెంచాతో తీసేస్తే ఇడియాప్పం ఇడ్లీల్లా వచ్చేస్తాయి. వీటిని ఏదయినా కూరతో కలిపి వడ్డించాలి.

వటయాప్పం

కావలసిన పదార్థాలు

బియ్యం-రెండున్నర కప్పులు, (మూడు నాలుగు గంటల ముందు నానబెట్టుకోవాలి), కొబ్బరి కాయ-చిన్నది ఒకటి.(తురిమి పెట్టుకోవాలి) యీస్ట్ - మూడు నాలుగు చెంచాలు. ఉప్పు-తగినంత చక్కెర-అర కప్పు, కిస్‌మిస్ , జీడిపప్పు-కొన్ని , యాలకులు-ఐదు

తయారీ

ముందుగా నానబెట్టిన బియ్యంలో నాలుగు టేబుల్ స్పూన్లు విడిగా తీసుకుని మెత్తగా దోశపిండిలా గరిటెజారుగా రుబ్బుకోవాలి. ఈ పిండిని బాణలిలో వేసి పొయ్యిమీద పెట్టాలి.ఈ పిండిని బాణలిలో వేసి పొయ్యిమీద పెట్టాలి. మంట తగ్గించి మధ్య మధ్య కలుపుతూ ఉంటే కాసేపటికి గట్టిపడుతుంది. అప్పుడు దింపేయాలి. ఇప్పుడు కిస్ మిస్, జీడిపప్పు తప్ప మిగిలిన పదార్థాల్ని తీసుకుని కొద్దికొద్దిగా నీళ్ళు చల్లుకుంటూ ఇడ్లీ పిండిలా రుబ్బుకోవాలి. ఇందులో ముందుగా ఉడికించి పెట్టుకున్న పిండిని వేసి బాగా కలిపి ఓ పెద్ద గిన్నెలోకి తీసుకుని ఓ రాత్రంతా నాననివ్వాలి. మర్నాటికి రెట్టింపు అవుతుంది. ఇప్పుడు ఈ పిండిని నెయ్యి రాసిన గిన్నెలోకి సగం దాకా తీసుకుని పైన కిస్‌మిస్, జీడిపప్పు చల్లి ఆవిరి మీద పది నిమిషాల వరకూ ఉడికించి తీసుకోవాలి. దీన్ని చికెన్ కర్రీ లేదా ఎగ్ కర్రీతో కలిపి అల్పాహారంలా వడ్డించాలి.

కుజలాప్పం

కావలసిన పదార్థాలు

బియ్యప్పిండి- ఒకటింబావు కప్పు,
కొబ్బరి తురుము- ముప్పావు కప్పు
ఉల్లిపాయ ముక్కలు-పావు కప్పు,
వెల్లుల్లి ముక్కలు-చెంచా
జీలకర్ర-పావు చెంచా,
కొబ్బరి తురుము- రెండు టేబుల్ స్పూన్లు
చిక్కని కొబ్బరి పాలు-పావు కప్పు కన్నా కొద్దిగా తక్కువగా
నల్ల నువ్వులు-ఒకటిన్నర చెంచా,
ఉప్పు- చెంచా
నూనె- వేయించడానికి సరిపడా.

తయారీ

ఉల్లిపాయలు, వెల్లుల్లి ముక్కలు, జీలకర్ర, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి తురుమును మిక్సీలో తీసుకుని మెత్తగా మిశ్రమంలా చేసుకుని దాన్ని కొబ్బరిపాలల్లో వేసుకోవాలి. ఇప్పుడు ఓ గిన్నెలో బియ్యప్పిండి, ముప్పావుకప్పు కొబ్బరి తురుమూ తీసుకుని బాగా కలిపి బాణలిలో వేయించుకోవాలి. పచ్చివాసన పోయాక అప్పుడు కొబ్బరిపాలు పోసేయాలి. రెండు మూడు నిమిషాలు కలిపి వేడి నీళ్ళు పోసుకుంటూ పిండిలా వచ్చేలా కలపాలి. ఈ పిండి చపాతీ పిండిలా మెత్తగా ఉండేలా చూసుకోవాలి. ఇందులో నువ్వులు వేసి మరో సారి కలిపి పైన తడి బట్టను కప్పి కనీసం అరగంట నాన నివ్వాలి.ఇప్పుడు కొద్దిగా పిండిని తీసుకుని చిన్న చపాతీలా వత్తాలి. దీన్ని చపాతీలు వత్తే కర్రకు చుట్టాలి. అప్పుడిది సగం రోల్ లా వస్తుంది. వీటన్నింటినీ వేడి నూనెలో బాగా వేయించుకుని తీసుకోవాలి.

కుందేలు ఎక్కడ?

ఈ చిత్రంలో మనిషితో పాటు వివిధ రకాల జంతువులు దాగున్నాయి. వాటిలో కుందేలు కూడా ఉంది. గుర్తించండి.

చుక్కలు కలుపుదాం



అతికించండి

ఒక తుంటరి పిల్లవాడు కుక్కపిల్ల బొమ్మను కత్తిరించి వాటిని అమర్చడం మరిచిపోయాడు. వాటిని తిరిగి అతికిస్తారు కదా!



ఏయే జంతువులు ఉన్నాయి

ఈ చిత్రంలో ఓ జీవి వుంది. కాకపోతే అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. వాటిని గుర్తించి చెప్పండి.

ప్రత్యేకమైనది ఏది?

ఈ చిత్రంలో ఆరు జతల టోపీలు ఉన్నాయి. ఇందులో ఒక టోపీ భిన్నంగా, బంటరిగాఉంది. గుర్తించండి.



సరైన దారి



పదాలు పూరించండి

చివరి అక్షరం కం వచ్చే విధంగా మిగతా పదాలను పూర్తి చేయండి.

1	ముల్లు	కం	ట	కం
2	పురుగు	కీ	ట	కం
3	అవరోధం			కం
4	ఎలుక			కం
5	పుట్ట			కం
6	ఎక్కువ			కం
7	హస్తభూషణం			కం
8	దోమ			కం
9	బంగారం			కం
10	నక్క			కం
11	గుర్తు			కం
12	గిన్నె			కం

పిల్లల మ్యూజియం

కేవలం పిల్లల కోసమే మ్యూజియాలు ఉన్నాయి. వాటిలో అమెరికాలోని ఇండియానాపోలీస్ చిల్డ్రన్ మ్యూజియం చాలా ప్రత్యేకమైంది. ప్రపంచం గురించి, జీవజాలం గురించి, భూమి గురించి అవగాహన కల్పిస్తారు ఇక్కడ. చరిత్ర, సైన్స్, భూమి వంటి అన్ని అంశాలకు చెందిన గ్యాలరీలు ఉన్నాయి ఇక్కడ. ఏటా పది లక్షల మంది వరకు దీన్ని సందర్శిస్తారు.

- 1925లో మేరీ స్టీవార్ట్ కోరీ అనే మహిళ మరికొందరు పెద్దలతో కలిసి ఈ మ్యూజియాన్ని ఏర్పాటు చేసింది.
- అమెరికా గురించి, ప్రపంచ సంస్కృతి గురించి, సామాన్య శాస్త్రం గురించి విడివిడిగా కలెక్షన్లున్నాయి.
- 5 అంతస్తుల్లో ఉండే ఈ మ్యూజియంలో లక్షా ఇరవై వేల వస్తువులను ప్రదర్శిస్తున్నారు.
- సుమారు నాలుగు లక్షల 72 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది.
- ఇక్కడ డైనోసార్ల సిమ్యూలేటర్ ఉంది. నిజం డైనోసార్లులాఇక్కడబొమ్మ డైనోసార్లు కదులుతాయి.
- పాతకాలం నాటి నీటి ఆవిరితో నడిచే రైలు ఉంది.
- కుటుంబంతో కలిసి విషయాలు నేర్చుకునేలా కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- ప్రపంచంలోని పిల్లలకు సంబంధించిన పురాతన మ్యూజియంలలో ఇది నాల్గవది.
- ఇక్కడ లిల్లీ థియేటర్లో చిన్నారులకు సంబంధించిన నాటకాలను, ప్రదర్శనలను నిర్వహిసా రు.
- తరగతులు, వర్క్‌షాపుల ద్వారా విషయాలను నేర్పుతారు.
- మొత్తం 400 మంది ఉద్యోగులు, 1500 మంది వలంటీర్లు ఇక్కడ పని చేస్తారు.
- పెద్ద బ్రాకియోసారస్ రాక్షస బల్లి బొమ్మను మ్యూజియం ఎదుట భవనంలోకి తొంగి చూస్తున్నట్టుగా ఏర్పాటు చేశారు.
- డైనోస్ఫియర్ అనే సినీడోమ్ థియేటర్లో రాక్షస బల్లుల లోకాన్ని తలపించేలా ప్రదర్శన ఉంటుంది.
- 'ఫైర్ వర్క్స్ ఆఫ్ గ్లాస్'గా పేరు పెట్టిన అద్దాలు భలే గమ్మత్తుగా ఉంటాయి.
- మ్యూజియం బయట రెయిన్ గార్డెన్, వరల్డ్ గార్డెన్‌లను ఏర్పాటు చేశారు. అవి చాలా బాగుంటాయి.
- నక్షత్రాలు, గ్రహాల గురించి చెప్పే ప్లానెటోరియం కూడా ఉంది.
- ఫ్రెంచి భౌతికవేత్త బెర్నార్డ్ గిట్టన్ తయారు చేసిన నీటి గడియారం ప్రపంచంలోనే పెద్దది.
- రెండో అంతస్తులో 'ఇన్ఫో జోన్' పేరిట పిల్లల లైబ్రరీ ఉంది. 'టేక్ మి దేర్' అనే ప్రదర్శన ద్వారా ప్రపంచంలోని ప్రత్యేకమైన చోట్ల గురించి చెప్పే ప్రదర్శన ఉంటుంది.
- మూడో అంతస్తులో 'పవర్ ఆఫ్ చిల్డ్రన్' పేరిట గ్యాలరీలు ఉంటాయి. అన్నే ఫ్రాంక్, రుబీ బ్రిడ్జెస్ లాంటి వారి విశేషాలు తెలి పేలాఆడియో, విజువల్ ప్రదర్శనలు ఉంటాయి.
- నాలుగో అంతస్తులో 'బ్రాడ్ రిపిల్ పార్క్'లో సైన్సు గురించి పిల్లలకు వివరిస్తారు. జీవ శాస్త్రంలోని రహస్యాలను చెప్పే 'బయోటెక్ ల్యాబ్' కూడా ఇక్కడ ఉంది.
- బొమ్మ పడవలు, ఇళ్లు తయారు చేసే ఆట స్థలముంది. కొండ రాళ్లు ఎక్కే, సొరంగాల గుండా వెళ్లే సాహస క్రీడల్ని ఆడవచ్చు. ✦



వార్తారచన,
కె.రామచంద్రమూర్తి,
పేజీలు:182, వెల:120/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణ మండపం, హైదరాబాద్.

వార్తా రచన

జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి, రచనా కౌశల్యాన్నీ మెరుగు పరచుకోవడానికి అధ్యయన సామాగ్రి అవసరం. అంతేగాక ఇటీవలి కాలంలో తెలుగులో పత్రికల సంఖ్య పెరగకున్నా ఉన్నా పత్రికల ఎడిషన్ల సంఖ్య బాగా పెరిగింది. తత్పరిణామ ఫలితంగా విలేకరుల సంఖ్య కూడా బాగా పెరిగింది. ఇలా కొత్తగా జర్నలిజంలోకి వచ్చిన వారికి వార్త రచన పద్ధతులను, విధి నిషేధాలను తెలియజెప్పడానికి కూడా మంచి గ్రంథాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. జర్నలిజం చరిత్రను, వ్యవస్థను, మూల సూత్రాలను వివరిస్తూ గతంలో కొన్ని పుస్తకాలు వచ్చాయి. వాటి ఉపయోగం, విలువ వాటికి ఉంది, కాని ఒకే పుస్తకంలో శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న జర్నలిజంను పరిచయం చేయడానికి జరిగే ఏ ప్రయత్నమైనా అసమగ్రం కాకా తప్పదు. అందుకే జర్నలిజానికి సంబంధించిన ఒక్కో అంశాన్ని దానిస కల పార్శ్వాలను సమగ్రంగా ప్రామాణికంగా "స్థితోస్మి గత సందేహ" అనిపించేట్టుగా విద్యార్థిని తీర్చిదిద్ద గలిగే గ్రంథాల అవసరం ఏర్పడుతున్నది. శ్రీ కె. రామచంద్రమూర్తి రచించిన 'వార్త రచన' ఈ దిశలో మహత్తరమైన ముందడుగు జర్నలిజంలో స్నాతకోత్తర శిక్షణ పొంది దాదాపు రెండు దశాబ్దాల పాటు దిన పత్రిక సంపాదక వర్గంలో వివిధ హోదాలలో పనిచేసి విశేషమైన అనుభవాన్ని గడించిన శ్రీ రామచంద్రమూర్తి తమ అనుభవ సారాన్ని కాచి వడబోసి పాఠకుడు సునాయసంగా సేవించి జీర్ణించుకొని లాభపడటానికి వీలుగా ఈ పుస్తక రూపంలో అందించారు. వార్తా రచనకు సంబంధించి ప్రతి విలేకరి, ప్రతి విద్యార్థి తెలుసుకోవలసిన సమస్త అంశాలను సాకల్యంగా ఇందులో అందించారు. అందుకే ఇది జర్నలిజం విద్యార్థులకు కరదీపికగా ఉపయోగపడే అవశ్యపఠనీయ గ్రంథం అవుతుంది.

- జి.ఎస్ వరదాచారి

గుడుగుడు గుంచం

'గుడుగుడు గుంచం' పిల్లల గేయ సంపుటి. రచయిత, కవి, మంచి కళాకారుడు. భూపాల్ చిన్న చిన్న మాటలతో పేర్చి కూర్చిన ఈ గేయాలు తెలుగులో నేడు వెలువడుతున్న బాలసాహిత్యం పరిణతిని సూచిస్తున్నాయి. లేతమామిడి చిగురులాంటి ఈ పదాలతో భూపాల్ తాను ఎంచుకున్న వస్తువుకు నీతి కూడా జోడించారు. ఇతడు ఈ గేయాల ద్వారా ప్రబోధించే నీతి కృత్రిమంగా లేదు. అతి సహజంగా పండు వెన్నెలతో మెరిసే సెలయేటి ప్రవాహంలా ఉంది. అది ఆయా గేయాల పరిధిలోకి ఒదిగిపోయింది. గేయాల ద్వారా పిల్లల మనస్సులను హత్తుకునేలా ఒక విషయాన్ని మనం ఎలా చెప్పగలం? అన్నదే నేటి బాలల రచయితలకు ముందున్న సమస్య. ఎంతోమంది. బాలల రచయితలు ఈ సమస్యను పరిష్కరించుకుంటు ముందుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. భూపాల్ ఈ సమస్యను సునాయా సంగా అధిగమించాడు. ముందుగా రచయితలకు పిల్లల ఆత్మ తెలియాలి. దేన్ని వాళ్లు విశ్వసిస్తారో. దేన్ని గబుక్కున పట్టుకోగలుగుతారో. దేన్ని వాళ్ళు పదే పదే మననం చేసుకుంటూ పాడుకోగలుగుతారో ఆ విషయాన్ని బాలలకు అందించగలిగితే మనం వాళ్ళ హృదయాల్ని చూరగొన్న వాళ్ళమౌతాం. ఆ దిశలో భూపాల్ పద్యాలు మంచి ఫలితాన్ని సాధిస్తాయని గాఢమైన నమ్మకం.

-బి.నర్సింగరావు



గుడుగుడు గుంచం,
రచన: భూపాల్,
పేజీలు: 32, వెల:20/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్.

సూక్ష్మ క్రిమి అన్వేషకులు

ఆలోచనల యుద్ధంలో పుస్తకాలే ఆయుధాలు అని అనుకున్నప్పుడు గత శతాబ్దంలో ఒక గొప్ప ఆయుధంగా ఉపయోగపడిన పుస్తకం microbe huntersµµ. ఇప్పటిదాకా ఈ పుస్తకం –హర్‌కోర్ట్ బ్రాస్ ఎడిషన్, బ్లూ రిబ్బన్ ఎడిషన్, హర్‌బ్రాస్ ఎడిషన్, పాకెట్ బుక్స్ ఎడిషన్ అన్నీ కలిపి బహుశ, కొన్ని వందల సార్లు పునర్ముద్రణలు పొందింది. ప్రపంచ పాఠకులకు కొన్ని మిలియన్ల ప్రతులు అందాయి. స్వయంగా డాక్టర్ పాల్ డి క్రూఫ్ శాస్త్రవేత్త గనుక, పన్నాలుగు మంది శాస్త్రవేత్తల జీవితాల్ని అర్థం చేసుకుని, వారి డైరీలు,ఉత్తరాలు చదివి, వారి వారి మిత్రుల్ని కలిసి వారు కృషి చేసిన స్థలాలు, ప్రయోగశాలలు సందర్శించి, వెలుగులోకి రాని అనేక సంఘటనల గూర్చి తెలుసుకుని ,విస్తృతంగా అధ్యయనం చేసి ఈ "మైక్రోబ్ హంటర్స్" రాశాడు. అందువల్ల ఇది సాంకేతిక పదజాలంతో సాగే సైన్స్ పుస్తకంగా కాకుండా శాస్త్రవేత్తల జీవిత గాథల్లోంచి వారు చేసిన వైజ్ఞానిక రంగపు కృషిలోంచి కచ్చితమైన వివరాలు అంది స్తూనే ఒక సృజనాత్మక రచనగా ఎంతో హృద్యంగా సాగింది. కనుకనే తరతరా లుగా ఈ పుస్తకం సామాన్య పాఠకుల్ని ఆకర్షిస్తూ వస్తోంది. అప్పటి దాకా కంటికి కనబడని సూక్ష్మ క్రిముల్ని కనుగొన్న మహానుభావులకు ప్రపంచ మానవాళి రుణపడి ఉంది. ఈ విశాల విశ్వంలో మన కంటికి కనబడని సూక్ష్మజీవులు బిలియన్ల సంఖ్యలో ఉన్నసంగతి "పాల్ డి క్రూఫ్" వివరంగా వివరిస్తే మూల రచనలోని వేగం, ఉత్కంఠత,విషయ వివరణ ఏదీ తగ్గకుండా పోటీపడి జమ్మి కోనేటి రావు తెలుగు రాశారు.

సూక్ష్మ క్రిమి అన్వేషకులు,
రచన: పాల్ డి క్రూఫ్,
అనువాదం: జమ్మి కోనేటిరావు,
పేజీలు:360,
వెల:250/-,
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ.



జీపుల హిప్‌హాప్

కొలంబియా కాఫీ ట్రయాంగిల్‌లో యిపావో అనే ఆచారం పాటించేది కేవలం జీపుల కోసమే. రకరకాల విన్యాసాలతో జీప్‌లు నడుపుతూ స్థానిక డ్రైవర్లు హిప్‌హాప్ చేయిస్తారు. అక్కడి క్విండియో ప్రాంత వాసుల జీవన చిత్రాన్ని మార్చివేశాయి విల్లీస్ జీపులు. కొండ కోనల మధ్య ఇరుకైన దారుల్లో వ్యవసాయ క్షేత్రాలు, మార్కెట్ ప్రాంతాలు, పక్క ఊళ్ల ప్రయాణాలను తేలిక చేసేశాయి అవి. ఇవే లేకుంటే పంట ఉత్పత్తులను, సరుకును, పశువులను చేరవేయడం కష్టమే అయ్యేది.1940 నుంచి మరో వాహనమేది దాని స్థానాన్ని భర్తీ చేయలేకపోయింది. పెద్ద బరువును తేలిగ్గా కొండెక్కిస్తూ, మలుపులను సురక్షితంగా దాటేస్తూ వారి ప్రయాణాన్ని సునాయాసం చేసిన ఆ జీపుల మీద ప్రేమతో వారు యిపావో సంప్రదాయాన్ని ప్రతి ఏటా జూన్‌లో వేడుక చేసుకుంటున్నారు. అంతెత్తున జీపుపై పేర్చిన సామానుతో పెరేడ్ నిర్వహిస్తారు. జీపుల గొప్పతనాన్ని, వారి డ్రైవింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ పోటీలు నాలుగు రకాలుగా నిర్వహిస్తారు. కాఫీ, అరటి, మొక్కజొన్న వంటి పంట ఉత్పత్తులను తరలించడం, ఇంటి సామానును మోసుకెళ్లడం, జీపులను రకరకాలుగా ముస్తాబు చేయడం వంటివి ఒక ఎత్తయితే పిక్యూ పోటీ మరో ఎత్తు. 2000 కిలోల బరువును జీపు వెనుక భాగంలో వేసి కేవలం వెనుక చక్రాల మీద జీపును నడుపుతూ విన్యాసాలు చేస్తారు. వీరిని జీపు కౌబాయ్స్ అని పిలుస్తారు. ఐదు రోజుల పాటు సాగే ఈ ఉత్సవం ప్రపంచంలోనే భారీ జీపు పెరేడ్ కింద గిన్నిస్ బుక్ రికార్డ్‌ను దక్కించుకుంది. ఈ జీపులను వీళ్లు స్థానిక భాషలో యంత్రపు కంచర గాడిదలంటారు.

మేను మెరుపు

దేహ సౌందర్యం ఓ అద్భుతం.. జాన్ పాప్‌ల్‌టన్ కెమెరాలో. సృష్టిలోని అబ్బురాల్ని మేనుపై పరిస్తే, ఆ వంపుల్లో వాగువంకలు ప్రవహిస్తే, వీపున పూదోట విరబూస్తే, దేహమే విశ్వ కాంతిని కప్పుకుంటే మహాద్భుతం.. అతడి మెరిసే ఫొటోల్లో. నల్లటి కాంతిలో మిలమిలలాడే బాడీస్కేప్‌లతో అబ్బురపరుస్తున్నాడు జాన్. ల్యాండ్‌స్కేపుల్లా భ్రమింపజేసేలా శరీరాన్ని దగ్గరగా ఫొటోల్లో బంధించే కళనే బాడీస్కేప్ ఫొటోగ్రఫీ అంటారు. దీన్నే ప్రత్యేక శైలిలో ఆవిష్కరించాడు. మెరిసే ఛాయాచిత్రాల లోకాన్ని దేహంపై దించేశాడు. నక్షత్ర మండలాలు, అరోరాలు, అటవీ ప్రాంతాలు, అగ్నిపర్వతాలు, జలపాతాలు, విద్యుల్లతల్ని మేనిపై అల్లేశాడు. చీకటి స్టూడియో గదిలో నల్లటి కాంతిలో మెరిసే నీలిలోహిత (అల్ట్రావయోలెట్) పెయింట్‌తో శరీరం కేన్వాస్‌గా చిత్రాలను వేశాడు. అమెరికాలోని సాక్రమెంటోలో పుట్టిపెరిగిన జాన్‌కు ఫొటోగ్రఫి అంటే ప్రాణం. హాబీ ఫొటోగ్రాఫర్ నుంచి మిత్రుల ప్రేరణతో ప్రొఫెషనల్ పోట్రయిట్ ఫొటోగ్రాఫర్‌గా మారాడు. 20 ఏళ్లకు పైగా పెళ్లిళ్లను అపురూపంగా రీల్‌లో బంధించిన జాన్‌కు ఎన్నో అవార్డులు వచ్చాయి. 2010లో హోటల్‌లో నిద్రలేని ఓ రాత్రిన ఈ బాడీస్కేప్ ఆలోచన తట్టింది అతడికి. అదే తన కెరీర్‌లోనే ది బెస్ట్ వర్క్ అయ్యింది.

•